"నా కు వీరోచిత మరణం లభిస్తుంది" గాంధీజీ విశ్వాసం
2-వ పేజీ

ఆంధ్రపత్రిక

316947

The Andhra Patrika, Madras. | Regd No. M. 1118. Vol. 34 No. 297 THURSDAY 19th FEBRUARY 1948 వెల ఒక అణా | Founder: K. Nageswara Rao

కాశ్మీర్ పట్ల పాకిస్థాన్ వైఖరి: షేక్ అబ్దుల్లా నిశితవిమర్శ
1-వ పేజీ

"అధికోత్పత్తికి దోహదంచేసే చర్యలనే ప్రభుత్వం తీసుకుంటుంది"

"ప్రపంచమంతా ఏకమైనా కాశ్మీర్ ప్రజల సంకల్పాన్ని మార్చజాలదు"

జవవాక్య నిర్ధారణలో పాకిస్థాన్‌కు ప్రమేయంలేదని అబ్దుల్లా హెచ్చరిక

"భారత సేనల ఉపసంహారం అసంభవం"

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: "కాశ్మీర్ దండయాత్రతో తమకేమి సంబంధం లేదని పాకిస్థాన్ ప్రకటించింది కనుక ఇకముందు పాకిస్థాన్ కాశ్మీరువ్యవహారంలో జోక్యం కలిగించుకొనేందుకు నేను అంగీకరించను. కాశ్మీరు కల్లోలానికి మూలకారణం కాశ్మీరులోనే వున్నదని తనమీద ఆరోపణ లన్నిటినీ ప్రతిఘటించిన పాకిస్థాన్, ఇప్పుడు కాశ్మీరును ఏవిధంగా చేజిక్కించుకుందామని ప్రయత్నించటం చాలా విపరీతంగా ఉన్నది." అని కాశ్మీరు తాత్కాలిక ప్రభుత్వాధ్యక్షుడూ, భద్రతామండలిలో భారతప్రతినిధివర్గనాయకుడూ అయిన షేక్ మహమద్ అబ్దుల్లా సోమవారంనాడు భారతముస్లిం ప్రముఖులు తనగౌరవార్థం ఇచ్చిన విందులో ఉపన్యసిస్తూ, ఉద్ఘాటించాడు.

మండలికర్తవ్యాన్ని నెరవేర్చలేదు

"కాశ్మీర్‌కు ఎక్కడో 10 వేలమైళ్ల దూరానవుండి సమస్యను పరిష్కరించటం భద్రతామండలికి చాలాకష్టం. ఇంతవరకు భద్రతామండలి చర్చలు, ప్రయత్నాలు అసలుఅంశాన్ని సాధించలేక పోయినవి. అమానుషమయిన హత్యాకాండ, గృహదహనాలు, మానవతులపై అత్యాచారాలూ ఇంకా జరిగిపోతునేవున్నవి. అసలు అంశాన్ని మరుగుపరిచేందుకు పాకిస్థాన్ ప్రతినిధి 1846 నుంచీ కాశ్మీర్‌చరిత్రనూ, ఇతర అసంగతమైన అంశాలనూ తీసుకువచ్చాడు కాని నిజమైన వివాదాంశం దుండగీళ్లకు పాకిస్థాన్ చేస్తున్న సహాయమేనని భారత ప్రతినిధి భద్రతామండలిలో స్పష్టంగా ప్రకటించాడు.

పైబిసైట్‌కు పాకిస్థాన్ సంబంధ మేమిటి?

కాశ్మీర్ భవిష్యత్తును జనవాక్యం ద్వారానే నిర్ణయిస్తామని భారతప్రధాని చాలా కాలం కిందటనే ప్రకటించాడు. కాశ్మీర్‌లో అందరూ జనాభిప్రాయాన్ని పట్టి పోవటానికే అంగీకరించారు. కాని ఈ విషయంలో పాకిస్థాన్ జోక్యం కలిగించుకునే అవసరం ఏమున్నది? మేము ఏ విధంగా నిర్వహిస్తామో వారికవసరం 'ముస్లిం ప్రజలకు ఆప్తమిత్రము పాకిస్థాన్' అనే మాట పట్టి బూటకమని, కాశ్మీర్ ముస్లిములపై జరిగిన ఘోరమైన అత్యాచారాలు ఋజువు చేస్తున్నవి.

తటస్థ ప్రభుత్వం అర్థరహితం

జనవాక్యం నిర్ధారించటానికి ప్రముఖ కాశ్మీర్ ప్రభుత్వాన్ని తొలగించి వేరే తటస్థ ప్రభుత్వాన్ని నెలకొల్పాలనటం చాలా అసందర్భంగా ఉన్నది. అమెరికా కొత్త అధ్యక్షుడు ఎన్నిక జరగాలని, ప్రెసిడెంట్ ట్రూమన్ ఇప్పుడే అధ్యక్షుపదవిని వదులుకొంటాడా? పార్లమెంటుకు కొత్త ఎన్నికలు జరగాలని ప్రధాని అట్లీ తన మంత్రివర్గాన్ని రద్దుచేస్తాడా? అదీకాక, ఇప్పుడు తటస్థులనే వారు ఎవరు ఉన్నారు? అంతా ఆటో, ఇటో చేరినవాళ్లేకదా! నన్ను కాశ్మీర్ ప్రజలు ఆస్థానంలో ఉండమని కోరారు కనకనే నేను ఉన్నాను, వారికి నేను పనికి రాకపోతే, భద్రతా మండలికూడా నన్ను కడ నిలపలేదు.

భారతసైన్య ఉపసంహరణ జరగదు

ప్రస్తుత ప్రభుత్వాన్ని రద్దుచేయాలన్న సూచనకు తోడుగా, భారత సైన్యాలని ఉపసంహరించాలని ఇంకొక విపరీత సూచన చేశారు. అప్పుడు కాశ్మీర్ ప్రజలను రక్షించేదెవరు? నేను నా ప్రజలను హంతకుల

3 వ పేజీ చూడుడు

జునాగఢ్ విషయమై భద్రతామండలిలో జవుల్లా ఫిర్యాదు

లేక్‌సక్సెస్, ఫిబ్రవరి 18: కాశ్మీర్ విషయమై తమ ప్రభుత్వంతో సంప్రదించటానికి భారత ప్రతినిధులు వెళ్లారు కనుక, ఇండియా పాకిస్థాన్‌లమధ్యఉన్న ఇతర వివాదాలను భద్రతామండలి ఈవేళ చర్చిస్తుందని రాయిటర్ విలేఖరి వ్రాస్తున్నాడు. పాకిస్థాన్ ప్రతినిధి సర్ జఫ్రుల్లాఖాన్, ఈ కింది ఆరోపణలనుచేసి వాదాన్ని నడుపుతాడు:

(1) పాకిస్థాన్‌లో చేరిన జునాగఢ్, మనవదర్, మొదలైన కొన్ని కథియవాడ్ సంస్థానాలను అక్రమంగా భారతసైన్యాలు ఆక్రమించుకున్నవి.

(2) ఆ సంస్థానాల్లోని ముస్లిముల ధన, ప్రాణాలకు ఆ సందర్భంలో తీవ్రనష్టం కలిగినది.

(3) కాబట్టి భారతప్రభుత్వం, ఆ సంస్థానాల్లోనుంచి తమ సైన్యాలనూ, ప్రభుత్వోద్యోగులనూ తక్షణం ఉపసంహరించుకుని, వాటిని వాటి 'సక్రమమైన పాలకులకు అప్పగించాలని భద్రతామండలి ఆజ్ఞాపించాలి. అంతేకాక అక్కడనుండి పారిపోయినవారి ఆస్తులన్నిటినీ వారికి భారతప్రభుత్వం అప్పగించి, కలిగిన నష్టాలకు పరిహారం ఇచ్చేట్లు కూడా భద్రతామండలి నిర్ణయించాలి.

జఫ్రుల్లావాదం ఈ రోజుల్లో దాదాపు పట్టబచ్చునని, ఈ రోజునే భారత ప్రతినిధులు దానికి జవాబివ్వకపోవచ్చునని తెలుస్తున్నది.

సరిహద్దులో రా. స్వ. సంఘ పైనిషేధం

పెషావర్, ఫిబ్రవరి 17: సరిహద్దు రాష్ట్రంలో రా. స్వ. సంఘం నిషేధింపబడినదని ప్రభుత్వ ప్రకటన వెలువడింది. రాష్ట్రంలో శాంతి భద్రతలను భగ్నం చేయటమే ఈ సంఘ లక్ష్యమని ప్రభుత్వమునకు విశ్వసనీయంగా తెలియడంవల్లనే ఈ నిషేధాజ్ఞ జారీ చెయ్యబడినదట.

గాంధీజీకి ఇండోనీసియా సౌహార్ద సంఘ అధ్యక్షుని అంజలి

లేక్‌సక్సెస్, ఫిబ్రవరి 17: భద్రతామండలి ఇవాళ ఇండోనీసియా సమస్యపై తీర్పుకు ఉపక్రమించేముందు, ఐక్యరాజ్య సమితి సౌహార్దసంఘం అధ్యక్షుడైన డా॥ ఫ్రాంక్ పి. గ్రహామ్ గాంధీమహాత్మునికి కృతాంజలుడై ఈవిధంగా సమోవాకములు అర్పించాడు:—

"ఆధ్యాత్మిక జీవితమునే పరమ ప్రధానముగా పరిగణించే మహోన్నతమైన మతం ఒకటి ప్రాచ్య ప్రజలలో ఆవిర్భవించి అభివృద్ధి కాంచింది. అస్త్ర శస్త్రముల యొక్కగాని సేనా వ్యూహముల యొక్కగాని ఆవశ్యకత లేకుండానే కేవలము ఆత్మబలముతో ఒక జాతిని ఉద్భవింప జేయవచ్చునని, గాంధీ మహాత్ముని జీవితము మనకు బోధిస్తున్నది. ఈ యంత్ర యుగమనే యొక్క కల్లోలంలో సైతం గాంధీ మహాత్ముని వాణి మనకు స్పష్టంగా వినవస్తున్నది గాంధీజీ వీర మరణం, జాతిమత వర్ణ విచక్షణకు అతీతమైన సర్వ మానవ భ్రాతృభావాన్ని ప్రతి హృదయంలోనూ రేకెత్తించింది. ఆయన ఆత్మ పూర్వ ఋషుల ఆత్మలతో ఐక్యం అయింది"

పరిశ్రమల జాతీయం చేయడంలో జాగ్రత్తగా వ్యవహరించాలని నెహ్రూ

పారిశ్రామికవిధానాన్నివివరిస్తూ శాసనసభలో అధినివేశ ప్రధానమంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: ప్రజోపయోగకరమైన పరిశ్రమలను, రక్షణపరిశ్రమలను ఇతర కీలకపరిశ్రమలను ప్రజాయత్తం చేయాలని, కాంగ్రెస్ 17 సంవత్సరములక్రితం తీర్మానించినది. ఈ పరిశ్రమలను ఎప్పుడో ఒకప్పుడు జాతీయంచేయవలసి ఉంటుందనే నేను భావిస్తున్నాను. అయితే ఈ పరిశ్రమల జాతీయంచేసే పని ఎక్కడ ప్రారంభించాలి? ప్రస్తుత వ్యవస్థను తారుమారుచేయకుండాను, ఉత్పత్తికి అవాంతరాలు కలిగించకుండాను ఈ పని ప్రారంభించి కొనసాగించడం ఎలాగ? మొదలైన ప్రశ్నలను విచారింపవలసి ఉంటుంది ప్రభుత్వం ఏమి తలపెట్టినా, ఏమి చేసినా ఉత్పత్తి అధికం కావాలనే ఉద్దేశ్యంతోటే ఉత్పత్తి హెచ్చుగా, ముఖ్యంగా ఆ కలాపానికి సంబంధించిన వివిధవర్గాల సహకారంపైన ఆధారపడి ఉంటుంది.

"మీ రీ అవసరం ఉన్నసందర్భములలో తప్ప ప్రభుత్వం ప్రమేయం కలిగించుకొని, తన సాధన సంపత్తిని వృథాచేయరాదు. అయితే మన సంపదను, శక్తిని కొన్ని కొత్తపరిశ్రమలకై వినియోగించాలి. అఖిలభారతకాంగ్రెసుకమిటీ తయారుచేసిన ఆర్థికోపసంఘం నివేదిక విప్లవాత్మకంగా ఉందని కొందరూ, తగినంతగా కమిటీ ప్రగతిమార్గాన్ని అనుసరించియుండలేదని మరికొందరూ అంటున్నారు. ఈ రెండు విమర్శలూ సరియైనవి కావు. అసలు అఖిలభారత కాంగ్రెసు కార్యవర్గం, అఖిలభారత కాంగ్రెస్ కమిటీలచే పరిశీలింపబడి, స్థిరపరుపబడవలసియున్నది," అని నేడు అధినివేశ శాసనసభలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ భారతప్రభుత్వ పారిశ్రామిక విధానాన్ని వివరిస్తూ దీర్ఘోపన్యాసం చేశారు.

సామ్యవాద ఆర్థికవ్యవస్థను [illegible] ఆ ప్రకారము ప్రధానమైన, కీలక పరిశ్రమల నన్నింటినీ ప్రభుత్వం తక్షణం జాతీయం చేయాలని, కాజీ కరీముద్దీన్ గారు ఒక తీర్మానాన్ని ప్రతిపాదించారు. (తీర్మానంపై చర్చ విడిగా ప్రకటింపబడింది.) చర్చ ఆరంభదశలోనే ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ ప్రభుత్వవిధానాన్ని వివరించారు.

(8 వ పేజీ చూడుడు)

గాంధీజీబోధించినప్రేమసిద్ధాంతమే ప్రపంచాన్నిరక్షించగలదు

క్రైస్తవమతస్థుల ప్రత్యేక ప్రార్థనలో క్రిప్స్‌ప్రశంస

లండన్, ఫిబ్రవరి 17: "గాంధీ మహాత్ముని జీవితం నైతికశక్తి యొక్క విశిష్టతను వ్యక్తం చేసే గొప్ప చిహ్నంగాఉన్నది. ఆ నైతికశక్తి మాత్రమే మనలనీ, ఆయన ప్రజలనీ, అందరినీ, రాబోయే కష్టకాలంలో కాపాడగలదు. పశుబలం ద్వారా ఆత్మరక్షణ చేసుకొన ప్రయత్నించటంనిరుపయోగమనీ, 'ప్రేమ'యొక్కమహోద్భుత శక్తి మాత్రమే మనలనురక్షించగలదనీ, మనం ఒక ప్రధానవిషయాన్ని ఆయన విశిష్టజీవితాన్నిచూసి ఎందుకు నేర్చుకోకూడదు?" అని బ్రిటిష్ జలజానా మంత్రి సర్ స్టాఫర్డ్ క్రిప్స్ ఈవేళ వెస్ట్ మినిస్టర్ ఆబీలో జరిగిన క్రైస్తవమత ప్రార్థనలో గాంధీజీనీ, సేవను స్మరిస్తూ మాట్లాడాడు.

తమ ప్రియమయిన మహాత్ముని గోల్పోయి ఒంటరిగాళ్ళయిన ఇండియా, పాకిస్థాన్ ప్రజల శ్రేయస్సు నిమిత్తం ఈ స్మారకప్రార్థన జరిగింది. వెస్ట్‌మిన్‌స్టర్ ఆబీలో బ్రిటన్ పాలకులు, ప్రఖ్యాతవ్యక్తులు, సమాధిచేయబడతారు. సమావేశంలో బ్రిటిషువారు, వివిధమతాలకూ చెందిన భారతీయులు, పాల్గొన్నారు. ఇండియా ప్రభుత్వం తరపున హైకమిషనర్ కృష్ణ మీనన్, పాకిస్థాన్ హైకమిషనర్ బ్రుసెల్స్ ఉన్నందువల్ల ఆయన ప్రధాన కార్యదర్శి మూయిజుద్దీన్ అహమ్మద్, బ్రిటిషుప్రభుత్వం తరపున సర్ ఎడ్మిరల్ సర్ ఆర్థర్, కర్మకాండలోపాల్గొన్నారు.

గాంధీజీ తన జీవితాన్ని అర్పించిన అహింస, సామరస్యాలు, ఇతోధికంగా వ్యాపించేందుకు క్రైస్తవ మత రీత్యా ప్రార్థనలు జరిగినవి.

ఈ 'ఆబీడీన్ (మతాధిపతి) డా॥ ఆలన్ సి. ధాన్ ఈకార్యకలాపంయొక్క ఉద్దేశ్యాన్ని వివరిస్తూ రక్తపాతాన్నీ, వైమనస్యాలనూ ఆరికట్టి పరస్పరశాంతి, సుహృద్భావాలను పెంపొందించటానికి దీనిని తలపెట్టినట్లు తెలియచేశాడు. ఆయన ఈ విధంగా గాంధీజీకి వినతి సర్పించాడు:

"ఈ విధంగా తమ మహాశయుణ్ణి గోల్పోయిన దుఃఖితప్రజల విచారంలో మేము పాలుపంచుకుంటున్నాము. ఇండియా, పాకిస్థాన్ ప్రజలతోపాటు, క్రీస్తు దేవుని అనుచరులమని చెప్పుకుంటున్న మనంకూడా గాంధీజీ జీవితాన్నిచూసి, ప్రపంచశ్రేయస్సుకు ఆయన చూపినశాంతి మార్గమే ఉత్కృష్టమైనదని గ్రహించవలసివున్నది. ఆవిధంగా మనం చెస్తే ప్రపంచానికి ఆయన మృతిద్వారా సంభవించిన నష్టాన్ని, గొప్పలాభంగా మార్చకలగుతాము. 'లయం'వల్ల మరింతగొప్ప 'సృష్టి' ఉద్భవించ గలదని ఋజువుఅవుతుంది."

క్రిప్స్‌ప్రశంస

"నైతికశక్తియొక్క విశిష్టతకు గొప్ప చిహ్నంగా గాంధీజీ ప్రకాశిస్తున్నా

(8-వ పేజీ చూడుడు)

మహాత్ముని పాదరక్షలలో ఒకటి దొరికింది

రాజఘాట్‌వద్ద ప్రార్థనలో భక్తిపురస్సరంగా సిక్కుప్రముఖుని సమర్పణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: ఇవాళ అపరాహ్ణం రాజఘాట్‌లో గాంధీమహాత్ముని ఆత్మశాంతికై యథాప్రకారం ప్రార్థనలు జరుగుతుండగా, సుందర రూపిణియైన ఒక సిక్కు రంగు గుడ్డలో చుట్టినొక్క పాదరక్షనొకదానిని భక్తిపూర్వకంగా కనులకద్దుకుంటూ దీనవదనంతో తదేక ధ్యానుడై నిలబడి ఉన్నాడు. ఢిల్లీలో ఉన్న తూర్పు పంజాబు యూనివర్సిటీ కాంపు కాలేజీలో ఆచార్యుడుగా పని చేస్తున్న ప్రొ॥ నిర్భయ్‌సింగ్ గారే ఆ సిక్కు. ఆయన తీసుకొని వచ్చిన పాదరక్ష గాంధీ మహాత్మునిది.

జనవరి 30 వ తేదీన గాంధీ మహాత్ముడు ప్రార్థన సమావేశంలో తుపాకి గుళ్లు తగిలి పడిపోగానే, ఆయన పాదరక్షలు జారి జనసమ్మర్దములో ఎక్కడో కనపడకుండా మాయమై పోయినవి. ఆయన కళ్ళకోడు కూడా కింద పడిపోయింది; సమావేశ స్థలంలో వెతకగా వెతకగా పాదరక్షలలో ఒకటి మాత్రం చిట్టచివరకు దొరికింది. రెండో పాదరక్ష, కళ్ళకోడూ ఏమయిపోయిందీ ఆచూకీ తెలియలేదు.

ప్రొ॥ నిర్భయసిగ్ గారు ఆ రోజున ప్రార్థన సమావేశానికి వచ్చారు. కింద పడి ఉన్న పాదరక్షను గుర్తుపట్టి దానిని సింగ్ గారు జాగ్రత్తగా ఇంటికి పట్టుకొని వెళ్లారు; గాంధీజీ పాదరక్ష దొరికిందని నిర్భయ్‌సింగ్ గారు మర్నాడే ఉత్తరంద్వారా అనుచరులకు తెలియచేశారు. 16 వ తేదీన రాజఘాట్ వచ్చి పాదరక్ష అప్పజెప్పవలసిందని గాంధీజీ అనుచరులు వ్రాసిన ప్రత్యుత్తరాన్ని పురస్కరించుకొని నిర్భయసింగ్ గారు నిన్న రాజఘాట్ వచ్చారు. ప్రొ॥ నిర్భయ్‌సింగ్ సయాల్‌కోట్‌నుంచి వచ్చిన ఒక శరణార్థి. ఈయన రోజూ గాంధీజీ ప్రార్థనసమావేశాలకు తప్పకుండా హాజరయేవాడు. పాకిస్థాన్‌లో ఆగస్టు 26 వ తేదీన [illegible] కొద్దిమైళ్లదూరంలో శతసహస్రసంఖ్యకంగా హత్యచేయబడిన ఒక శరణార్థి శ్రేణిలో ఈయనకూడా ఉన్నాడు. కాని దైవయోగంవల్ల నిర్భయ్‌సింగ్ గారికి మరికొంతమందికి ఆరోజున మృతితప్పినది. పోయిన కళ్ళజోడుకూడా ఇలాగే ఎవరైనా వచ్చి తమకు అప్పజెప్పవచ్చునని గాంధీజీ అనుచరులు ఆశపడుతున్నారు. కళ్ళజోడు బొమ్మ ఇతరపత్రికలలో ప్రకటించబడింది.

దౌలత్ రాంగారు, ఆహార, వ్యవసాయశాఖల కార్యదర్శులు, సేన్, కృష్ణస్వామి గార్లు 18 వ తేదీ ఉదయం విమానంలో ఢిల్లీకి వెళ్లారు. మద్రాసు ఆహార పరిస్థితి బాగుపడాలంటే దేశమంతా సాయపడాలని ఆయన పెదుతూ ఒక సందేశం ఇచ్చాడు.

కొరియాలో రష్యా విస్తృంభణ

అమెరికాకు హెచ్చరిక

వాషింగటను, ఫిబ్రవరి 17: క్రిష్ణ సోవార్డ్ పత్రికల విదేశ వ్యవహార సంపాదకుడగు విలియం ఫిలిప్సు సీమ్సు నేడు యిట్లువ్రాసిరి.

ఉత్తర పైభాగాలోని మంచూరియా కమ్యూనిస్టుల వశమగుచున్నది. దీనికి తోడుగా కొరియాలో రష్యను ప్రాబల్యము ఆక్రమణ హెచ్చుచున్నది. కొరియా మంచూరియా యిని రెండును రష్యనుల వశమైనయెడల, సమీపములోనున్న జపాను కూడా రష్యనులవశము కాగలదు. జపానులో అమెరికను ప్రాబల్యమిక సాగదు. ఆసియా ఖండమంతయు రష్యను అధికారముక్రిందకు రావలసియుండును. కనుక త్వరలోనే అమెరికా సం॥రా॥ ప్రభుత్వము నిద్రమేల్కొన వలెను.

ఉత్తరకొరియాలో రష్యను ప్రేరిత ప్రభుత్వం

కొరియాలో స్వతంత్ర ప్రజా ప్రభుత్వమును ప్రతిష్ఠించుటకు తగిన పద్ధతులను గూర్చి పరిశీలించుటకై ఐక్యరాజ్య సమితి కొరియా కమిటీని ఏర్పాటు చేసెను. ఈ కమిటీకి ఐక్యరాజ్య సమితిలోని భారతీయ సభ్యుడగు కే. పి. యన్. మీనను గారు అధ్యక్షులుగా నియమింపబడిరి. వీరు కొరియాలో తమ విచారణముగించి అమెరికా పనిచ్చేసిరి. తమ అభిప్రాయములను ఐక్యరాజ్య సమితిసభకు నివేదించుటకు న్యూయార్కు నగరమువద్ద లాగార్డియా విమానాశ్రయములో దిగిరి. కొరియాలో మీనను గారు రష్యనులు ఉండిరి. ఉత్తర కొరియాలో రష్యనులచేత కీలుబొమ్మయగు ఒకప్రభుత్వము ఏర్పాటు చేయబడియున్నది ఉత్తర కొరియాలోనివారు దక్షిణ కొరియాలోని వారును ఏకముగా నుండవలెనని కోరుచున్నారు. అనేక శతాబ్దముల నుండియు వారు ఏకముగా నున్నారు. ఉత్తర కొరియాలోనికి రష్యనుసేనలు ప్రవేశించి, దక్షిణ కొరియాలోనికి అమెరికను సేనలు ప్రవేశించి జపానుసేనలను మొదటకిరిమివేసెను. కాని, యిప్పుడు ఉత్తర కొరియాలో రష్యను ప్రేరితమైన ప్రభుత్వ మేర్పడియున్నది. దానిని పడగొట్టుటకు ఉత్తర కొరియాలోని ప్రజలకు శక్తి సామర్థ్యములులేవు. ఉత్తర కొరియాలోనికి వెళ్లి అచటి పరిస్థితులను చూచుటకు ఉత్తర కొరియా ప్రభుత్వం అనుమతి నీయలేదు. కొరియా సమస్యను ఐక్యరాజ్యసమితివారే పరిష్కారం చేయవలెనని అమెరికా పట్టుదల వహించుచున్నది.

ఉత్తర కొరియాలో రష్యనులు తమకు అనుకూలముగా నుండెడి ప్రభుత్వ పీఠమును ఏర్పాటు చేసిన విధముగానే దక్షిణ కొరియాలో అమెరికనులు మరొక ప్రభుత్వ పీఠమును స్వతంత్రించి ఏర్పాటు చేయ బూనుకొనరు.

ఉత్తర కొరియాలో ప్రజల కమిటీ అనునది యొకటి ఏర్పడెను. దానినే రష్యావారొక ప్రత్యేక ప్రభుత్వ పీఠముగా చేసిరి.

సురేజ్‌మల్జు
1895 నుండి నగల్ల రత్నాలు
313 నేతాజీ రోడ్, మద్రాసు

గంటల పంచాంగము

సర్వజిత్ సం॥ మాఘ శు॥ నవమి 1948 సం॥ ఫిబ్రవరి 19 గురువారం

సూ॥ నవమి సా 5 50 గం॥ సా 3 33 వర్జ్యం ఉ 7-44 ల 9-18 వ.

శుభదినము ఫిబ్రవరి 20 శుక్రవారం

సూ॥ దశమి ప 3 48 మృ ప 2 16 వర్జ్యం రా 9-59 ల 11-28 వ.

ఆంధ్రపత్రిక

సర్వజిత్ సం॥ మాఘ శు॥ నవమి

గురువారము

పరిశ్రమలు - ప్రభుత్వము

పరిశ్రమలను జాతీయముచేయు నీపయమున కేంద్రప్రభుత్వ వైఖరిని వివరించుచూ ప్రధాని పండిత నెహ్రూ చేసిన ప్రకటన, తుదకు ప్రధాన కాంగ్రెసు ఆర్థిక కార్యక్రమ సంఘ సూచనలవల్ల ఏర్పడిన తొట్రుపాటును, నివృత్తి చేయగలదు పండిత నెహ్రూ చెప్పినట్లు ఉత్పత్తి అధికమగుటే నేటి అన్యాయ నరసమస్య. ప్రభుత్వము ఏమార్గము అవలంబించినను ఉత్పత్తి అధికరించు కావలెననునదే దృష్టియందుండవలెను. అందువల్లనే పరిశ్రమలను జాతీయముచేయుట అందుకు దోహదమిచ్చిన, దాని సమస్యలు చేయుటకు సందేహించవని పండిత నెహ్రూ తెలిపెను. అది సిద్ధించనపుడు జాతీయము చేయుటలో ప్రయోజనము లేదు. జాతీయము చేయుట సాధనముగాని, ఆశయము మాత్రము కాదు.

పరిశ్రమలన్నీ తక్షణము జాతీయము కావలెనని ముందు వెనుకలు గమనించక నిత్యము కేకలు వేయువారికి దానిలో ఉన్న కష్టనష్టములు పండిత నెహ్రూ వివరణవల్ల బోధపడగలవు. జాతీయము కావలెననుట వట్టి తీర్మానములవల్ల లభ్యముకాదు. అదికాక ప్రస్తుత దేశావసరములను బట్టి ఉన్న విధానమును నిర్మూలించిన రాగల ఫలితములు ఏవిధముగ నుండునో తీవ్రముగ ఆలోచించవలసియున్నది. ఇప్పటికన్న ఫలప్రదమైన దానిని సిద్ధపరిచినగాని ఉన్నదానిని రద్దుపరచుటలో గల అర్థము, ప్రయోజనము శూన్యము. దేశ ఆర్థిక విధానము పరివర్తన చెందవలెననుట ఎవరును కాదనజాలరు. కాని అనుశాసన నిర్మాణముతో ఒక్క పెట్టునరాజాలదు. రాజ్యాంగ సభ కరీముద్దీన్ ప్రతిపాదించిన తీర్మానమును అధినివేశ శాసనసభ ఆమోదించినంతమాత్రమున అన్ని సక్రమముగ జరిపిపోజాలవు. ప్రస్తుత సమస్యలు తీరవు. ఆయన తీర్మానము ఒక దృక్పథమును మాత్రమును ప్రస్ఫుటింపజేయుచున్నది. ఆ దృక్పథమును కాంగ్రెసు ఎపుడో ఆమోదించినది. కాబట్టి దేశతక్షణ అవసరములను పరిస్థితుల ననుసరించి ఇబ్బందిలేకుండ ఆ దృక్పథమును ఎంతవరకు అచరణ జరుపుట అవసరము అన్నదే ప్రస్తుతసమస్య. పండిత నెహ్రూ చెప్పినట్లు, "మనదేశ పరిస్థితులను పరిశీలించుటలో అనేక విషయములను గమనించవలసియున్నది. ఇప్పటికన్న శీఘ్రము సాధనములను తక్షణము చూపగలిగినపుడే ఉన్నవాటిని నిర్మూలించవలెను. అని లేనపుడు ప్రమాదము సాధించుటకు పథకమును నిర్ణయించవలసియున్నది. నిర్మూలనము కథ తేలికఅయినపని. నిర్మాణము అంత తేలికకాదు. ఒక ఆర్థికవిధానమును మార్పు ప్రయత్నములో దుష్ఫలితములు అవాంతర పరిస్థితి ఏర్పడవచ్చును. అసలు ప్రధాన విషయమైనఉత్పత్తి నిలచిపోవచ్చును. ఉన్న సాధనములుకూడ ఎందుకు కొరగాకుండపోవచ్చును." పండిత నెహ్రూ చెప్పిన ఈ మాటల భావమును అందరూ గమనించుట అవసరము. జాతీయము చేయుటకు ఆర్థిక నిర్మాణములో అనేక సమస్యలను సమన్వయపరచవలసియున్నది.

కాంగ్రెస్ ఆర్థిక కార్యక్రమ ఉపసంఘ నివేదిక పారిశ్రామికులకు తత్తరపాటును కలుగజేసినది. అంత తొట్రుపడ నవసరములేదని పండితనెహ్రూ తెలియజేసెను. ఆ ఉపసంఘ నివేదిక కార్యక్రమాంశికగాక ఒక కార్యవిధానము మాత్రమే అనెను. క్రీలకపరిశ్రమలు అనగా ఏవో నిర్వచించుటేగాక వాటిని ఎపుడు జాతీయమొనర్చవలె ననుటకూడ పథకనిర్ణయ సంఘము తేల్చవలసియుండును తప్పనిసరియైనపుడే ఇపుడున్న పరిశ్రమలను ప్రభుత్వము వశపరచుకొనును గాని లేనియెడల నూతన పరిశ్రమలనే తాను స్థాపించపూనుకొనినది. అవిధముగ చేయుటవల్ల దేశపారిశ్రామికశక్తి అధికమై ఉత్పత్తి ఎక్కువ కాగలదు అలాకాక, ఉన్న పరిశ్రమలను ప్రభుత్వము చేబట్టినయెడల, తరుశక్తియంతయువాటిపైనే వ్యర్థము కాగలదు దానిమూలమున యుద్ధసామగ్రి ఉత్పత్తి జరుగదు గాని, ఉత్పత్తి దృష్ట్యా ఫలితము విశేషముండదు. అయితే ఎందువలన ఈ విధానమును అవలంబించి ఆ పైన పరిస్థితిని పునర్విచారణ చేయదలచుట పారిశ్రామికులందరికి తృప్తినివ్వవచ్చును. అంతేకాక ప్రస్తుతమున్న పరిశ్రమలను యథావిధముగనే యుంచి, ఇతరరంగములందే ప్రభుత్వము ప్రవేశింపనున్నది. అదే సవ్యమైన పద్ధతి

అస్సాంలో అధికారోత్పత్తి వారం

గౌహతి, ఫిబ్రవరి 17: నేటినుంచి అస్సాములో "అధికారోత్పత్తి" వారం జరుపబడుతుంది. రాష్ట్రంలో ఏయే ఆహారధాన్యం ఎంత తక్కువగా వున్నదనీ, ఈ కొరతను ఎల్లా ఎదుర్కొనాలి, ఎక్కువలోగల వివిధరకాలు, మొదలైన విషయాలను ప్రజలకు సుబోధకం చేస్తారు. అస్సాములో నూటికి 90 వంతులు కృషిసాయం వృత్తిగాగలిగిన ప్రజలైనా, నేడు ఆహారకొరత ప్రజల్లోనెక్కువగా బాధిస్తున్నది. ఏటా 12 కోట్ల రూపాయల విలువగల ఆహారపదార్థముల నీ రాష్ట్రం దిగుమతి చేసుకోవలసి వస్తున్నది. ముఖ్యంగా పప్పు దినుసులు, బెల్లం, నూనెలు అనేవి రాష్ట్రపు దిగుమతులు.

పాలస్తీనా విషయమై ఐక్యరాజ్య సమితిలో తీవ్రప్రతిష్టంభన?

బ్రిటిష్‌విదేశాంగశాఖ అభిప్రాయం

లండన్, ఫిబ్రవరి 17: పాలస్తీనా విషయమై ఐక్యరాజ్య సమితిలో తీవ్రభేదాభిప్రాయాలు కలగబోతున్నవని బ్రిటిష్ విదేశాంగ కార్యాలయం, ఇంతవరకూ ఆవిషయమై జరిగినదానిని సమీక్షచేస్తూ, అభిప్రాయం ప్రకటించింది. సమితి నియమించిన కొన్ని ఉపసంఘాలు ('చిన్నసమితి' వలెనే) బహిష్కరిస్తూ స్లావదేశాలు ప్రకటించినప్పుడు ఏర్పడ్డ వైరుధ్యంకన్నా ఎక్కువ వైరుధ్యమే దీనివలన రావచ్చునని ఆ ప్రకటన హెచ్చరించింది. రెండు నెలలుగా ఐక్యరాజ్యసమితి పాలస్తీనా సమస్యను సవ్యంగా పరిష్కరించటానికి చేసిన ప్రయత్నాలన్నీ నిష్ఫలమైపోయిన అంశాన్ని ఈ ప్రకటన ఉదహరించింది.

(ఎ. యు. పి)

బియ్యం రేషనింగు చాటు వర్తకం

అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు

చెన్నపురి, ఫిబ్రవరి 18: బియ్యం రేషనును తలకు రోజుకు 8 ఔన్సులనుండి 12 ఔన్సులకు హెచ్చించుటకుగాని, 8 ఔన్సులకంటె తగ్గించుటకుగాని ప్రభుత్వం యోచించుటలేదని ఆహారశాఖా మంత్రి డా॥ రాజన్‌గారు నేడు మద్రాసుఅసెంబ్లీలో శ్రీ. యస్. గోవిందస్వామిగారి ప్రశ్నకు సమాధానమిస్తూ చెప్పిరి. చెన్నపట్నంలో చాటుగా, శాసనవిరుద్ధంగా జరగుతున్నవర్తకంలో బియ్యం విరివిగాదొరకుతున్నటు ప్రభుత్వానికి తెలుసునని, ఈచాటు వర్తకాన్ని అణచడానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటున్నదనీ డా॥ రాజన్ చెప్పారు. హామీద్ ఖాన్‌గారి ప్రశ్నకు సమాధానమిస్తూ దొరికినంతవరకు జొన్నలు మొదలైనవానిని ఇచ్చినారనీ, తిరిగి వీలైనప్పుడు ఇవ్వగలనని చెప్పారు.

ఇప్పుడు రేషనింగు అమలులోఉన్న ప్రదేశాలన్నిచోట్లా అందరికీ చాలినంత బియ్యం బ్లాక్ మార్కెట్‌లో దొరకకున్నందువల్ల రాష్ట్రంలో పూర్తిగా కంట్రోల్‌ను తొలగించరాదా అని యస్. యమ్. ఆర్. సుబ్బరామన్‌గారు ప్రశ్నించగా, కంట్రోల్ రద్దు క్రమంగా ప్రవేశపెట్టబడుతున్నదనీ, అది ప్రభుత్వ విధానంలో ఒకభాగం మాత్రమేనని, వెంటనే అంతా రద్దుచేయడానికి వీలుండదని డా॥ రాజన్ చెప్పారు. పరిమిత పరిమాణంలో బియ్యాన్ని పట్నంలోకి తెచ్చుకొనివ్యవచ్చని, చెన్నపురి రేషనింగు సలహాసంఘం ఇటీవల చేసిన సూచనలనుగురించి ప్రభుత్వం ప్రస్తుతం ఆలోచిస్తున్నదని రామస్వామి మొదలియారుగారికి చెప్పారు.

కంట్రోలు రద్దువిధానం ప్రస్తుతం తృప్తికరంగా ఉన్నందువల్ల నెల్లూరువంటి జిల్లాల్లో తాలూకాలమధ్య రవాణాపై నిషేధం తొలగించరాదాఅని వెన్నెలకంటి రాఘవయ్యగారు ప్రశ్నించగా, కంట్రోల్ రద్దుఫలితాలు రాఘవయ్యగారు తలచినంత తృప్తికరంగా లేవని రాజన్‌గారు చెప్పారు.

చిరాకోలులో కంట్రోల్ రద్దుచేయవలెనని స్థానిక ఆహారసలహాసంఘం సలహా ఇచ్చినందువల్ల అక్కడ కంట్రోల్ తొలగించెదరా అని, గరిమెళ్ల కుమారస్వామిగారు ప్రశ్నించగా, సలహా సంగతి తమకు తెలియదని రాజన్‌గారు చెప్పారు. తాలూకా సప్లయి ఆఫీసర్లను ఇంకా ఎందుకు తొలగించలేదని కాకు బ్రహ్మానందరెడ్డిగారు ప్రశ్నించగా, కంట్రోల్స్ రద్దుపని ముగించుటకు ఇంకా వారు అవసరమున్నదని చెప్పారు.

నాన్ గెజెటెడ్ ఆఫీసర్లు

శ్రీ బి. యస్. మల్లికార్జునరావుగారి ప్రశ్నకు సమాధానమిస్తూ డా॥ సుబ్బరాయన్‌గారు సమ్మెచేసిన నాన్ గెజెటెడ్ ఆఫీసర్లపై ప్రభుత్వం ఎట్టి చర్యతీసుకొనరాదని నిర్ణయించిందో తెలిపారు. ఈ వివరాలు జనవరి 8 వ తేదీ ప్రభుత్వ ప్రకటనలో ఇవ్వబడినది.

నాన్‌గెజెటెడ్ ఆఫీసర్ల కరువుభత్యాలనుగురించి ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు చేసి ప్రకటించింది. ఇంటిబాడ్డె భత్యాలను గురించి ఇంకా నిర్ణయం జరగలేదు. కాని బడ్జెట్ శాసనసభలో ప్రవేశపెట్టేముందు నిర్ణయింపబడుతుంది.

సమ్మె అనంతరం ఆఫీసర్లపై క్రమశిక్షణచర్యలను తీసుకొనుటలోనూ, ప్రభుత్వశాఖలలో ఉద్యోగుల సంఖ్యను తగ్గించుటకు కొందరిని తొలగించుటలోనూ ఆంధ్రులు చాలామంది తొలగింపబడినమాట వాస్తవమేనా అని గుంటూరు నరసింహారావుగారు ప్రశ్నించగా, రామస్వామి మొదలియారుగారి ప్రశ్నకు సమాధానమిస్తూ ప్రభుత్వం నాన్ గెజెటెడ్ ఆఫీసర్లపై కఠిన చర్య తీసుకొనుటలేదనీ, కాని వారికి కార్మికులకు మధ్యగా సంఘోద్యమాల హక్కు లేదనీ చెప్పారు.

బేగం ఆమీరుద్దీన్‌గారికి మంత్రి మాధవ మీనన్‌గారు మద్రాసు విజిలెన్స్ ఏసోసియేషన్‌ను ప్రభుత్వం స్వాధీన పర్చుటకు నిశ్చయించిందనీ, త్వరలోనే దీనికి సంబంధించిన శాసనం శాసనసభలో ప్రవేశపెట్టబడగలదనీ తెలిపారు.

బేగం ఆమీరుద్దీన్‌గారి ప్రశ్నకు సమాధానమిస్తూ మంత్రి గోపాలరెడ్డిగారు ప్రభుత్వోద్యోగులనుండి విరమించిన వారికి అసలు పెన్షన్ల ఆధారంపై కరువుభత్యాలు నిర్ణయింపబడినవనీ, అట్టినూత్రం భారత ప్రభుత్వ ఉత్తరువుపై అనుసరింపబడుతున్నదనీ చెప్పారు.

పి. కందస్వామి పిళ్లైగారి ప్రశ్నకు మంత్రి పీతారామరెడ్డిగారు సమాధానమిస్తూ సేలం జిల్లాలో 30 కోట్ల టన్నుల ఇనుము దొరకగల గనులున్నమాట నిజమేనని, ఈ గనులను త్రవ్వు విషయమై మద్రాసు ప్రభుత్వం భారత ప్రభుత్వాలు ఆలోచిస్తున్నదనీ, పెట్టుబడిదారు లెవరైనా ఈ గనులు త్రవ్వుటకు యత్నించగోరితే ప్రభుత్వం ఆ విషయమైకూడా ఆలోచించగలదనీ చెప్పారు. దేశంలోని ఖనిజసంపదను పరిశీలించుటకుగాను ఒక పరిశోధన సంస్థను నెల్కొంచు విషయమైకూడా ప్రభుత్వం ఆలోచిస్తున్నదని తెలిపారు.

విరామ తీర్మానం

చెన్నపురి, ఫిబ్రవరి 18: నేడుదయం మద్రాసు అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల అనంతరం శ్రీ కిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారు (కమ్యూనిస్టు) తిరుచునాపల్లి మునిసిపల్ ఎన్నికలు జరిగేసమయంలో జిల్లా మేజిస్ట్రేటు 144 వ సెక్షన్ కింద నిషేధపుటుత్తరువును జారీచేసినందువల్ల ఆ పరిస్థితిని చర్చించవలెనని ఒక విరామతీర్మానం ప్రవేశపెట్టారు. డా॥ సుబ్బరాయన్‌గారు తిరుచునాపల్లినుంచి ఆ సమాచారమేదీ ఇంతవరకూ ప్రభుత్వానికి చేరలేదనీ అందువల్ల ఈ సమయంపై చర్చ జరుపుటకు అంగీకరించజాలననీ చెప్పిరి. కాని అక్కడపరిస్థితి తామూహించుకొన గలరని చెప్పిరి. ఎన్నికలసందర్భంలో అక్కడ కలహాలు చెలరేగే భయంతో ఇట్టి ఉత్తరువు జారీ అయివుండవచ్చునన్నారు. కాని ఈ నిషేధపుటుత్తరువుల్ల ఎన్నికలకు ఎట్టిభంగం కలగదనీ, కమ్యూనిస్టులు దానివల్ల భయపడ నవసరం లేదనీ, కమ్యూనిస్టు లెవరైనా ఎన్నికోబడ్డానికి తాము బద్ధులుకారు గనుక దాన్ని పంతోషించగలరనీ, అయితే ఎన్నికోబడ లేకమోనని స్వకీయకరంగా తాము సందేహిస్తున్నారనీ చెప్పారు శ్రీ వెంకటేశ్వర్లుగారు విరామ తీర్మానాన్ని వుపసంహరించుకొన్నారు.

పాత శాసనాలు

అనంతరం అడ్వైజర్ల పరిపాలన కాలంలో అమలుజరిగినశాసనాలలో 28 శాసనాలనుయెప్పటివలెతిరిగి అమలుజరుపుటకునూ, 18 శాసనాలనుకొద్దిమార్పులతో అమలుజరుపుటకునూ, ఒకశాసనాన్ని రద్దుచేయుటకునూ ఒక సెలెక్టుకమిటీ పరిశీలనకు ఒప్పగించవలెనని డా॥ సుబ్బరాయన్ గారు ప్రతిపాదించారు. యిటీవలనే ప్రభుత్వం కొన్ని శాసనాలనుఇట్లు ప్రవేశపెట్టింది ఈరెండవ సంపుటంలోని శాసనాలనుకూడా పరిశీలించుటకు అదే సెలెక్టుకమిటీకి ఒప్పగించవలెనని ప్రతిపాదించారు.

ఈశాసనాలలో సవరణలు ప్రవేశపెట్టుటకు అవకాశం ఉండవలెనని కె. భాష్యంగారు సూచించారు.

అడ్వైజరీ పరిపాలనలో అమలుజరిగిన శాసనాలను ఇప్పుడు తిరిగి అమలుజరుపుట దురదృష్టమని పి. వెంకటేశ్వర్లుగారు విమర్శించారు. వానిలోని ప్రతిశాసనాన్నీ ప్రత్యేకంగా శాసనసభలో ప్రవేశపెట్టవలెనని చెప్పారు.

డా॥ సుబ్బరాయన్‌గారు ఈ విమర్శలకు తావులేదన్నారు. తరువాత సభ ప్రతిపాదనను ఆమోదించింది.

రాష్ట్ర ఆహారపరిస్థితి

రాష్ట్రప్రభుత్వంతోదౌలత్‌రాంచర్చ

మద్రాసు, ఫిబ్రవరి 17: పాలఘాట్, బెంగుళూర్, కోయంబత్తూరులను చూసి ఇండియా ఆహారమంత్రి జయరామ్‌దాస్ దౌలత్‌రాంగారు ఈవేళ సాయంత్రం మద్రాసుకు విమానంలో తిరిగివచ్చారు. అనంతరం ఆయన ప్రధాని రామస్వామి రెడ్డి, రాష్ట్రఆహారమంత్రి రాజన్, వ్యవసాయమంత్రి మాధవమీనన్, ఇతరప్రభుత్వోద్యోగులతో రాష్ట్రఆహారస్థితినిగురించి చర్చించారు. మద్రాసు ప్రభుత్వం తో డ్వాటుతో, రాష్ట్రఆహారపరిస్థితిని అప్పుడప్పుడు పరిశీలించటానికి కేంద్రప్రభుత్వం కొన్ని ఏర్పాట్లు చేసుందని తెలుస్తున్నది. ఈ విషయమై ఇతర సంప్రతింపులు కొద్దిరోజుల తరువాత, ఉభయప్రభుత్వాల ప్రతినిధుల మధ్య, ఢిల్లీలో జరగగలవు.

ఆహారమంత్రిపర్యటన

ఈవేళతో ఆహారమంత్రి 5 రోజుల పాటు మద్రాసు రాష్ట్రములో పర్యటనచేశాడు. కోయంబత్తూర్ దగ్గర కేరళ కాంగ్రెసు అధ్యక్షుడు కేలప్పన్‌ను కలుసుకుని పాలఘాటుకు వెళ్లాడు అధికోత్పత్తికిమిత్తం ఇరిగేషన్ స్కీములను ప్రారంభించవలసినదని కోరగా 'జనం తిండిలేక మాడుతున్నారు కనుక స్వల్పకాలంలో ఫలితం ఇచ్చే స్కీములను మాత్రమే తలపెట్టమని' ఆయన హెచ్చరించాడు. ఈ ఏడాదిలోపుగా పూర్తయే 2 చిన్న స్కీములను తలపెట్టారనీ, వాటికింద 30 వేల ఎకరాలు సాగవుతుందనీ 3¼ కోట్ల రూపాయలతో ఒక పెద్దస్కీమును 3 ఏళ్లలో పూర్తిచేశారనీ తెలియచేశారు. దీనికింద 50 వేల ఎకరాలు సాగుకాగలవని తెలుస్తున్నది.

బెంగుళూర్

బెంగుళూర్ దగ్గర మైసూర్ ప్రధాని చంగల్రాయరెడ్డి, ఇతర మంత్రులూ కలిసి ఆయనకు తమ ఆహారపరిస్థితిని తెలియచేసి ఈకింది సహాయాలు చేయమని కోరారు.

(1) ఇండియా ప్రభుత్వోద్యోగస్థానాన్ని పరించి పెట్టధాన్యాల కంట్రోలు తొలగించాలి. బియ్యం కంట్రోల్ ఊడాతీయాలంటే 20 వేల టన్నుల మామూలు కోటాయే కాక, అదనంగా 30 వేల టన్నులను కేంద్ర ప్రభుత్వం పంపించాలి. ఇది అత్యవసరం.

(2) 20 వేల టన్నుల గోధుమలు కావాలి.

(3) పూర్లులోని 4 వేల టన్నుల అదనపు బియ్యం మాకు ఇప్పించాలి.

(4) విద్యుచ్ఛక్తి ఇరిగేషన్ పథకాలకు ఉపయోగించటానికి అవసరమయిన సామానులు వెంటనే పంపాలి.

(5) ఆహారపదార్థాలను చౌకగా అమ్మించటానికి మైసూరు ప్రభుత్వం తన ఆదాయంలో నాలుగోవంతు వినియోగిస్తున్నది. కనుక సత్వర సహాయం అవసరం.

వీరోచిత మరణమే తనకు లభిస్తుందని గాంధీజీ విశ్వాసం

ఒక అనుచరుని వివరణ

గాంధీమహాత్ముడు ఎల్లప్పుడూ తనకు వీరోచిత మరణము లభిస్తుందని నమ్మినట్లూ, అనివయం ఒకసారి ఆయన తనతో ముచ్చటించినట్లూ, గాంధీజీ అనుచరుల్లో ఒకరయిన ఆనంద్ టి. హింగొరానీగారు ఈనెల 15 వ తేదీ 'హరిజన్' లో వ్రాశారు. అది ఈకింద ప్రకటించబడినది:

"అప్పుడు 1933 వ సం॥ సెప్టెంబర్ మొదటిభాగం గడుస్తున్నది. యరవాడ జైలులోనుంచే అస్పృశ్యతానివారణోద్యమం నడపటానికి ప్రభుత్వం తగిన సౌకర్యాలుచేయ నిరాకరించటంవల్ల ఆయన అగస్టు నెలలో ఉపవాసం ప్రారంభించాడు. 8 రోజుల్లో ఆయన పరిస్థితి విషమించటంవల్ల పూనాలోని సాసూన్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడకూడా 2 రోజులున్నతరవాత, ఇక ఆలస్యిస్తే ప్రయోజనంలేదని 28 వ తేదీన ఆయన్ను ఏ షరతులూ లేకుండా విడుదలచేశారు. ఆయన తరువాత పూనాలోని 'పర్ణకుటి'లో విశ్రాంతి తీసుకుంటున్నాడు.

అప్పుడు 'హరిజన్' సంపాదకుడు నెలవు మీద వెళ్లటంవల్ల, గాంధీజీ జ్ఞాపకమరించి నేను పూనాలో వుండి ఆ పనిని నెరవేరుస్తున్నాను. అందుచేత గాంధీజీ పర్ణకుటిలో విశ్రాంతి తీసుకుంటున్నంతకాలమూ ఆయనతో కలిసివుండే భాగ్యం నాకు లభించింది.

ఉపవాసం చేపినప్పుడు ప్రభుత్వ నిర్బంధాజ్ఞను వ్యతిరేకించిన నేరానికి ఆయన ఒక సం॥పు శిక్షను అనుభవిస్తున్నాడు. శిక్షాపరిమితి పూర్తికాకుండానే తనను విడుదలచేయటంవల్ల ఆయనకు ఒక పెద్ద సందేహం కలిగింది. తన శిక్షాపరిమితి పూర్తయేంవరకూ ఏమిచేయాలో ఆయనకు తెలియలేదు.

ఒకరోజు సాయంత్రం నేను ఆయనతో ఒంటరిగా ఉన్నాను. అప్పుడు ఆయన ఏదో పెద్ద ఆలోచనలో మునిగి, తోటలో కచారు చేస్తున్నాడు. సాయంత్రపు నీరెండ చెట్లమీదా, పుష్పాలమీదనూ పొరలంగా ఉన్నది. అంతవరకూ నెమ్మదిగా ఆలోచిస్తూ ఉన్న ఆయన చటుక్కున నా వైపుతిరిగి ఇట్లా అన్నాడు: "ఈ సందిగ్ధ తరుణంలో నేను ఎమిచేస్తే బాగుంటుంది? ఈ లేదవ ఉపవాసదీక్షలో విడుదల అవుతానని నేను అనుకోలేదు. ఈ దీక్షలో మరణించటానికి నాకు వీలుకలగుతుం దనుకున్నాను. నాకిక నేను సిద్ధపడి నా వస్తువులన్నిటినీ, అక్కడి నర్సులకూ, ఇతర పనివాళ్లకూ ఇచ్చివేశాను. ఆ మర్నాడే నన్ను విడుదల చేశారు నేను ఉపవాస దీక్షలో మరణిస్తే ప్రజలు ఏ విధంగా భావించి ఉండేవారో నాకు తెలియదు."

"అంతకన్నా ఉత్తమ మరణం వుంటుందా? బాపూ!" అని నేను అన్నాను.

"వెర్రికన్న! ఉపవాసంచేసి మరణించటం ఉత్తమమైనదని నీ వనుకుంటున్నావన్నమాట! నేనుమాత్రం అట్లా అనుకోను. ఆ విధంగా మరణించటంలో ఉన్న గొప్పతనం ఏమిటి? నా జాతకంలో నేను వీరోచితమైన మరణాన్ని పొందుతానని వున్నది. అదినీకు తెలుసా?"

"కాని—బాపూ! ఆవిధంగా ఉపవాసంచేసి మరణించటం మాత్రం వీరోచితమయినదికాదూ? నెమ్మదిగా, క్రమక్రమంగా, అట్లా చనిపోవాలంటే మహాధైర్యమయిన ధైర్యంవుండాలి."

"అక్కరలేదు! దానికి ధైర్యం అవసరమని నేను అనుకోను. తుపాకిదెబ్బతగిలో లేక ఉరిస్తంభంమీదనో, నేను నాజీవితాన్ని ముగిస్తాను వీరోచితమయిన మరణమంటే అదేకాని, మంచంమీద పడుకొని ఉపవాసంచేసి ప్రాణం వదలడం కాదు."

సంక్షోభాన్ని అణచివేయడానికి పోలీసులకు అధికారాలు

రాష్ట్ర ఎసెంబ్లీలో హోంశాఖ మంత్రి బిల్లు

చెన్నపురి, ఫిబ్రవరి 17: అరాచకనివారణ శాసనంపై చర్చ నేడుదయం మద్రాసు అసెంబ్లీలో కొనసాగింది. శ్రీ డబ్లియు. శ్రీనివాసరావుగారు శాసనమును విమర్శించిరి. పోలీసులకు అసాధారణ అధికారాలను ఇచ్చుట మేలుకాదని తమ అనుభవంవల్ల గ్రహించినారని వారుచెప్పిరి. రాష్ట్రవిభజనను కోరువారు, కొందరు కొన్ని పత్రికలు రాష్ట్రంలో అశాంతి వ్యాపింపచేయాలని యత్నిస్తున్నారనిరి. ఇట్టి పరిస్థితిలో, ప్రజల్లో పరపతిగలవారు పరిపాలన సాగిస్తున్నప్పుడు, మంత్రులకు సన్నిహితులైనవారును, వారి పక్షంవారు తప్ప, ఇతరులలో చాలమంది బాధలకు లోనుకాగలరనిరి.

అబ్దుల్ హమీద్ ఖాన్‌గారు ఈశాసనం అన్యాయంగా ఏర్పాటు ఎరగని వారిపై ప్రయోగించబడగల అవకాశం చాలా ఉన్నదన్నారు. అరాచకాలను నివారించుటకు షోంగా కొన్ని దమనాలను నిర్మించినగాని ఇతర విధానాలను అవలంబించి ప్రజలను స్వయంగా రక్షించుకొనుటకు అలవరచవలెనే గాని ఇట్టి శాసనాలను అమలుజరుపరాదనిరి.

ప్రభుత్వం ప్రజలందరి శ్రేయముకొరకు పనిచేయాలిగాని, ఒక్క సంఘంలేక ఒక్క పార్టీ శ్రేయముకే ఆలోచించరాదు. జిల్లా కలక్టరులు శాంతి సంఘాలు స్థాపించి, వారిపై బాధ్యత మోపాలి. మదరాసు సి. ఐ. డి శాఖ వృద్ధిచేయాలి. బయట రాష్ట్రాలకు పంపి ఉద్యోగులకు శిక్షణ యివ్వవలెను. వారు ప్రభుత్వానికి సరియైన సమాచారం తెలుపుట్టి వారుగా నుండాలి. కాని తమకు పడకివారందరిపై రిపోర్టులు చేయువారుగా నుండరాదు. ఈ చట్టం గాంధిగారి సిద్ధాంతాలకు కనుకూలంగాలేదు. విరుద్ధంగానుండి. దీనివల్ల చాల పమాదమునును, కనుక ఉపసంహరించుకోవాలని కోరిరి.

డా॥ ధ. రామచంద్రరావుగారు, యీ చట్టమునకు అవసర మనుపడలేదనిరి. ఈ రాష్ట్రంలో సాంఘిక కొట్లాటలులేక శాంతంగా నుండంటూ, గాంధిగారి అనుకలు నీ కలిసినమరువాడయి టువంటి చట్టం తెచ్చుటకు తగినంత చెడు పరిస్థితులున్నవా యని సందేహించిరి. ఎంతో చెడునుచేయ అవకాశంగల యీ చట్టం అంగీకరింపకోగుటకు, హెడుకనిస్టేబుకే ఎన్నో అధికారాలిచ్చుటకు ఏమి అవసరం గలదు? మైసూరు పోలీసులకు ప్రజలయందున్న గౌరవం బ్రిటిషు రాష్ట్రాలలో పోలీసులకు యిప్పటికీలేదు. వారికి ఎక్కువ అధికారాలు యిచ్చుటవల్ల లాభంలేదు. సభ్యులకు పరిస్థితులన్ని బోధపరిస్తేగాని, గాంధి శిష్యులమయిన తాము యీ చట్టాన్ని బలపరుచలేమనిరి. ఈ చట్టానికి అగత్యమయిన ప్రమాద పరిస్థితులేమిగలవో చెప్పమని కోరిరి.

చిన్న ఖాజీసాహెబుగారు, నిప్పును నిప్పుతో అర్పలేం, దౌర్జన్యాన్ని దౌర్జన్యంతో అణచలేం గనక, యీ చట్టంవల్ల ప్రయోజనం లేదనిరి. యోగియగు మహాత్ముడు ఉంటే యిటువంటిచట్టం చేయలేకుండారు. మనుష్యవేటకు, చిన్నజీవులకు ఉరిశిక్ష వేయుటకు యీ చట్టం అవకాశమిస్తున్నది. అకారణంగా మనుష్యులను కాల్చివేయరాదనిరి. సాంఘిక కల్లోలాలు కొట్లాటలు మంత్రిగారికి చెప్పిరాలు. కనుక ముందుగా కొన్ని ప్రాంతాలందు అధికారులకు ప్రత్యేకాధికారాలు యిచ్చుటకెట్లు తెలియవన. ఈ చట్టం దుర్వినియోగం చేయుటకు అవకాశంగలదు. ముస్లిములకు గాంధి యడల ఎక్కువ గౌరవంగలదు. వారిని అనుమానించి యిటువంటి చట్టాలు చేయరాదు. ముస్లిములు యీ ప్రభుత్వంయడల ఎంతో భక్తిగౌరవములు గలవారు. వారిని ద్రోహులని అనుమానించుట పాపమనిరి. చట్టం సవరించితే గాని తాను చట్టమును బలపరచలేననిరి. తుపాకి కాల్చుటకు ఉత్తరువు చేయు అధికారం క్రొత్తగ ఎవరికి యివ్వరాదనిరి.

ఆర్. స్వామినాథనుగారు కూడా, హెడుకనిస్టేబుకి తుపాకులు కాల్చే అధికారం యిచ్చుట భావ్యంకాదనిరి. ప్రభుత్వం మారినా పోలీసు వైఖరి మారలేదు. వారింకను శత్రురాజ్యం అధికారం క్రింద నున్నట్లే యున్నారు. పోలీసు శాఖ ఇన స్పెక్టరు బసులో వెనుకు సీటునందు కూర్చున్నవాడు తనకు చోటివ్వకపోతే, కాట్టి తీసుకున్నాడు. మంత్రిగారికి పిర్యాదు చేస్తే, కాశీతాలు జిల్లా సూపర్నెంటుకి పంపి, ఏమీ జరుగలేదని జబాబు చెప్పిరి. ఇట్లా పరిపాలనవుంటే, యిలాంటి చట్టాలవల్ల ఎక్కువ ప్రమాదం గలదనిరి. ప్రధాని ఎప్పుడూ సభలో కనబడరు. కాదన ఖుళ్యులను కూడ చూడరని విమర్శించిరి. హూటింగు అధికారం సబు ఇనస్పెక్టరు కేనా యివ్వాలి కాని, హెడు కనిస్టేబుకి యివ్వరాదనిరి.

సభవారు ఫలహారములకు లేచిరి.

మంగళవారం కార్యక్రమం

చెన్నపురి, ఫిబ్రవరి 17. అరాచకులను అణచడానికిగాను ఒక శాసనాన్ని నేడు మధ్యాహ్నం మద్రాసు అసెంబ్లీలో డా॥ సుబ్బరాయన్‌గారు ప్రవేశపెట్టారు.

భారతదేశంలో ఇతరరాష్ట్రాల్లో సంభవించిన అరాచకాల అనుభవంవల్ల ఏప్రభుత్వమైనా సరే ముందుజాగ్రత్త వహించడం అవసరమని శాసనం చివర వివరించబడింది.

అయితే ఈ శాసనం ఆధారంతో ప్రభుత్వం ఏపార్టీనిగాని వ్యక్తినిగాని అణచడానికి యత్నించదని డా॥ సుబ్బరాయన్ శాసనాన్ని ప్రవేశపెడుతూ చెప్పారు. ఇంతవరకూ దక్షిణదేశంలో శాంతి భంగం కానప్పటికీ ఇటీవల ఒక ప్రత్యేకవర్గం హింసకు గురైందని డా॥ సుబ్బరాయన్ తెలిపారు.

ఈ శాసనం ఆమోదింపబడినప్పటికీ అమలు జరుపవలసిన అవసరం కలుగకూడదని ఆశిస్తున్నట్లుచెప్పారు. ప్రజలందరి క్షేమానికి ఈ శాసనం ఉద్దేశించబడింది. ప్రభుత్వం ఒక పక్షానికి చెందినదైనప్పటికీ పార్టీజనులతో నిమిత్తంలేకుండా ప్రజలందరి క్షేమం నిమిత్తం ఇది ఉపయోగించబడుతుందని కమ్యూనిస్టు సభ్యులకి వాగ్దానమివ్వగలరని డా॥ సుబ్బరాయన్ చెప్పారు.

ప్రభుత్వం ప్రజలందరి శ్రేయముకొరకు పనిచేయాలిగాని, ఒక్క సంఘంలేక ఒక్క పార్టీ శ్రేయముకే ఆలోచించరాదు. జిల్లా కలక్టరులు శాంతి సంఘాలు స్థాపించ

హోమియోపతీ వైద్యవిధానము

అధినివేశ పార్లమెంటులో సెజ్జానా తీర్మానమునకు ఆమోదము

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: హోమియోపతీ విషయమై పతీర్ చంద్ర సామంతాగారు మొదట ప్రతిపాదించిన తీర్మానం స్థానే శ్రీ మోహన్‌లాల్ సాజ్జానాగారు ప్రతిపాదించిన తీర్మానమును నేడు అధినివేశ పార్లమెంటువారు ఆమోదించిరి.

సాజ్జానాగారి తీర్మానమిట్లున్నది:—"చాలామంది హోమియోపాతిక్ ఔషధములను సేవించి తమ జాడ్యములను నివారణ చేసికొనుచుండుటచే ఈ వైద్యవిధానబోధకు యేర్పాట్లు చేయు విషయమై ప్రభుత్వమువారు ఆలోచింపవలెను, ఈ వైద్యవిధానమును బోధించుటకు పోస్టు గ్రాడ్యుయేటు కోర్సులుండుట ఉచితమని, ఈ వైద్యశాస్త్ర ప్రమాణములు ఉన్నతమైనవిగాను, సర్వత్ర సమముగాను వుండులాగై ఈ వైద్యులను నియమించుట, వారి రిజిస్ట్రేషనుకు యేర్పాట్లు చేయుట ఉచితమని ఈ సభ వారు అభిప్రాయపడుచున్నారు."

హోమియోపాతిక్ వైద్యవిధానమును ఇండియాను యూనియనువారు రికగ్‌నైజు చేయవలెనని (గుర్తింపవలెనని) ఈవైద్యవిధానమునకు ఒక జనరల్ కౌన్సిలు, ప్రభుత్వశాఖ (స్టేట్ ఫాకల్టీ) వెంటనే యేర్పరుపవలెనని సుమంతారుగారు మొదట ప్రతిపాదించిన తీర్మానము కోరుచున్నది.

మోహన్‌లాల్ సాజ్జానాగారు తన తీర్మానమును ప్రతిపాదించుచు బ్రిటిష్ పాలనలో హోమియోపాతీ అశ్రద్ధచేయబడెనని ప్రభుత్వంవారు ఆ విధానమును రికగ్‌నైజు చేసిన యెడల నది భారతదేశ వైద్యసమస్యల పరిష్కారమునకు చాలా తోడ్పడునని చెప్పిరి.

ఈ మందులు చవకగా లభించుచుండుటచే భారతదేశమువంటి లీదదేశములో ఈ వైద్యవిధానం చాలా ఉపయోగకరముగా నుండునని, ఢిల్లీ గ్రామప్రాంతములలో జయప్రదమైన ఈ చికిత్సా విధానమును ఆలోపాతిక్ వైద్యుల పక్షపాతమూ ప్రజలకు లేకుండా చేయరాదని ఉపన్యాసకులు చెప్పిరి.

కేవలము శాస్త్రముగా ఈ వైద్యవిధాన పఠనమునకు సౌకర్యము లొసంగుట తనకు సమ్మతమేనని డా॥ పట్టాభి సీతారామయ్యగారు చెప్పిరి ప్రభుత్వమువారు ఈ వైద్యవిధానమునంగీకరించుటవల్ల హోమియోపాతిక్ వైద్యవిధానమునకు యెక్కువ ప్రయోజనము కలుగదనిరి.

రాజ్‌కుమారి అమృతకౌరు

ఆరోగ్యశాఖ మంత్రిణి శ్రీమతి రాజకుమారి అమృతకౌరు ప్రసంగించుచు సుమంతీగారు ప్రతిపాదించిన తీర్మానమును తాను అంగీకరింపనందుకు కారణములు వివరించిరి. పథవారు పట్టుదలగా నుండుట చేత మోహన్‌లాల్ సాజ్జానాగారి తీర్మానమును తాను అంగీకరింతుననిరి. ఐనప్పటికి మన ప్రజలకు వైద్యసహాయము చేయుచున్నవారి విద్యా, శిక్షణ ప్రమాణములను ఉన్నతమైనవిగా చేయవలసిన అవశ్యకతను పథవారు గ్రహింపవలెను. ఇట్లు చేయక పోయినయెడల శాస్త్రము తెలియకుండా వైద్యముచేయువారిసంఖ్య అపరిమితముగా నున్న ఈ దేశములో అజ్ఞానులగు సామాన్యప్రజలు నష్టపడెదరు' అని ఆమె చెప్పెను. హోమియోపాతిక్ వైద్యము చవకయను వాడమునకు సమాధానమొసంగుచు అలోపాతిక్ వైద్యవిద్యార్థుల శిక్షణమునకు యెంతద్రవ్యము ఖర్చగునో అంత ద్రవ్యము హోమియోపాతిక్ వైద్యవిద్యార్థుల శిక్షణమునకు ఖర్చగునని. సమస్యనంతటిని విచారించుటకు తాను ఒక కమిటీ నేర్పరుచుకొని, ఆ కమిటీ నిర్ణయములను అమలుపరుచుటలో ఆలస్యము జరగకుండా తాను చూచునని మంత్రి చెప్పెను.

సోషలిస్టు వ్యవస్థ

కాజీ సయ్యద్ కరీముద్దీన్‌గారు సోషలిస్టు వ్యవస్థా స్థాపనమునకు సంబంధించిన తీర్మానమును ప్రతిపాదించుచు యిట్లు చెప్పిరి:—"పరిశ్రమలను జాతీయము గావించు విషయమై ప్రభుత్వము వారికి ఒక నిశ్చితమైన విధానము లేకున్నది. ఇందు విషయమై ఆర్థికసభ్యుడు చెప్పిన మాటలు ప్రధాని ప్రకటనలకు కాంగ్రెస్ తీర్మానములకు విరుద్ధముగా నున్నది. ఇందుకు ఫలితంగా పారిశ్రామిక ద్రవ్యసహాయ సంస్థ స్థాపనమునకు 'ఒక నల్ల బిల్లు' ఆమోదింపబడినది. ఇది పెట్టుబడిదారులకు లాభకరమైన బిల్లు. ప్రభుత్వమువారు బ్రహ్మాండ సమస్యను సెలవార్చునున్నారని నే నెరుంగుదును. కేవలపరిశ్రమల నన్నిటిని అమాంతంగా జాతీయము గావించ వీలులేదని గూడ నే నెరుంగుదును. విప్లవప్రతికి ప్రభుత్వమువారు ఒక నిశ్చితమైనట్టి, స్పష్టమైనట్టి విధాన మవలంబించుటవసరము"

హుస్సేన్ సమాన్‌గారు ప్రసంగించుచు ప్రభుత్వమువారు స్వయముగా అభివృద్ధి చేయదలచుచున్న పరిశ్రమలేవో ప్రభుత్వమువారు సూచింప వలెననిరి. ఇట్లు చేసిన యెడల పెట్టుబడిదారులకు భీతి తగ్గునని, ఇతర పరిశ్రమలకభివృద్ధికి పెట్టుబడి ధనము లభించునని ఆయనచెప్పెను. బొగ్గు పరిశ్రమను జాతీయము చేయవలెనని, అభివృద్ధికాని ఖనిజ సంపత్తియంతయు ప్రభుత్వము వారిదిగా నుండవలెనని ఆయనచెప్పెను.

తీర్మానము ఉపసంహరించుకొనబడెను.

ఉద్యోగములలో మతవర్ణ వివక్షతలు పాటింపరాదు

ప్రభుత్వోద్యోగములలో మత, వర్ణ శాఖాభేదముల నంగీకరింపరాదని, ప్రభుత్వమువారు ఉపయోగించు ఫారములలోను, ప్రభుత్వ రిజిస్ట్రేషన్లలోను మతము, వర్ణము, శాఖాప్రస్తావన యుండరాదని శ్రీ వాకర్‌గారు ప్రతిపాదించిన తీర్మానముపై చర్చ జరిగెను.

ప్రజాసత్తాక ప్రభుత్వము పరిగా పని చేయవలెనన్న ప్రభుత్వోద్యోగములలో మతవర్ణ, శాఖాభేదములు పూర్తిగా పోవలెనని దివాకర్‌గారు చెప్పుచు తన తీర్మానము బ్రహ్మాండమైన మతసమస్యకు సంపూర్ణముగా పరిష్కారంపగోరునది కాదని, మతవర్ణవిభేదములను పూర్తిగా రద్దుచేయుటకు ఒక పెట్టుమాత్రమేనని చెప్పిరి.

చాలమంది సభ్యులు చర్చలో పాల్గొని వివిధ సూచనలు గావించిరి. వర్ణాంతర వివాహము లుండవలెనని, ప్రాథమికనిర్బంధవిద్యయుండవలెననివారు సూచించిరి.

గాడ్గిల్ సమాధానము

వక్ఫ్, గనులు, విద్యుచ్ఛక్తిశాఖ మంత్రి గాడ్గిల్‌గారు చర్చకు సమాధానమొసంగుచు తీర్మాన దృష్ట్యా సమస్యవిచారింపబడునని హామీయిచ్చిరి. మతవర్ణ విభేదములు బ్రిటిషు ప్రభుత్వము వారినుండి మనకు సంక్రమించిన పనిచెడ్డచు వానిని మనము పూర్తిగా తొలగించవలెననిరి. మత వర్ణవిభేదములు క్రమ క్రమముగా రూపుమాసిపోవుచున్నవని ఆయన చెప్పుచు ఆగస్టు 15 తరువాత భారతీయులు తొలుత వర్ణము వారని, అనగా భారతీయులని, తరువాత ఒకే మతమువారని, అనగా మానవులని తలంచుచుండిరనిరి. (వార్ధ్యానములు) పెద్యూలు తరగతులు మినహా తక్కిన అందరికి ఉద్యోగములిచ్చు విషయమున పోటీ పరీక్షలద్వారా యోగ్యతను మాత్రమే పరిగణించు చున్నారని ఆయన చెప్పెను. శాసనమువారా మత, వర్ణవిభేదములు తొలగవని చెప్పుచు ఈ మత వర్ణవిభేదములల్లకలుగు అనర్థమును ప్రజలు గ్రహింపవలెనని హెచ్చరించి.

అ. ప్రే.

పాకిస్థాన్‌లో యూదు జాతిపై హత్యాకాండ

ఐక్యరాజ్య సమితికి యూదుప్రముఖుని వినతి

లేక్ సక్సెస్, ఫిబ్రవరి 17: పెషావర్‌లో ఈ మధ్య జరిగిన ఒక యూదీయుల హత్య ఎవరో దొంగలుచేసినదని మాత్రమే కాని రాజకీయాలతో సంబంధించినది కాదని పాకిస్థాన్ ప్రభుత్వం చేసిన ప్రకటనను ఖండిస్తూ, అది దొంగలచేసినదనికాదనీ, పాకిస్థాన్‌లో వున్న యూదులందరినీ హత్యచెయ్యాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రోత్సహించిన కార్యమేనని ప్రపంచ యూదు కాంగ్రెసు రాజకీయసంఘ అధ్యక్షుడు మారిస్ పెరల్‌స్టీన్ నేడు ఆరోపించాడు.

పాకిస్థాన్ యూదులు అనేకులు ఇండియాకు పోలిపోయారనీ, ప్రతి మహమ్మదీయ రాజ్యంలోనూ యూదులగతి యిట్లాగే వుందనీ, ఐక్యరాజ్యసమితి ఒక పరిశీలక సంఘమును ఏర్పరచి ఈ విషయం కనుక్కోవలెనని డాక్టర్ మారిస్ అన్నాడు.

ఆంధ్రరాష్ట్ర నిర్మాణం

రంగాగారి అభిప్రాయం

కాకినాడ, ఫిబ్రవరి 15. నిన్న పత్రికా విలేఖరులతో సంప్రదించుచు ఒకవిలేఖరి ప్రశ్నకు సమాధానంగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీసభ్యులు శ్రీ ఎన్. జి. రంగాగారు, ఆంధ్రరాష్ట్ర నిర్మాణం గురించి ఆంధ్రులు ఓపికతో నుండవలెనని, ఒకటి, రెండు సంవత్సరము లాలస్యమైనప్పటికి రాష్ట్రం వచ్చుట తథ్యమనీ, ఆంధ్రులు ఓర్పును విడినాడరాదనీ చెప్పిరి. (స్వ. వి.)

తెనాలి పురపాలక సంఘ సమావేశము

తెనాలి, ఫిబ్రవరి 15: ఈ పట్టణ మునిసిపల్ కౌన్సిలు సభ్యులు సమావేశమై గుంటూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ పాతూరి సుబ్బయ్యగారి మరణమునకు సంతాపము తెలియజేసిరి. 48-49 సం. బడ్జెటును పరిచూచుటకు రావి సర్వజ్ఞారాయణ (చైర్మన్) గోపరాజు కృష్ణమూర్తి, వడ్డయూడికోట యయ్యచౌదరి, ఎన్. ఎల్. రాయిగార్లతో ఒక ఉపసంఘమును నియమించిరి. స్వ. వి.

సహకార సమష్టి సాగు పద్ధతులనే అమలుపరుస్తాం

ప్రభుత్వవిధానాన్ని వివరిస్తూ నెహ్రూ ప్రసంగం

(1 వ పేజి తరువాయి)

సాధ్యమైతే ఈ సమావేశంలోనో, లేకుంటే ఈ దఫా జరుగు సమావేశంలోనో పరిశ్రమల విషయంలో నిర్దుష్టమైన కొన్ని ప్రతిపాదనలను గాని, లేక ప్రభుత్వ విధానాన్ని వివరించు ఒక దీర్ఘప్రకటనను గాని శాసనసభకు నివేదించడమౌతుందని పండిత్ నెహ్రూ వెల్లడించారు. "ఆర్థిక విషయములకు గాని, తదితర అంశములకు గాని సంబంధించి అఖిలభారత కాంగ్రెసు కమిటీ ఒక కార్య ప్రణాళికను గాని, ఒక నివేదికనుగాని అధికారరీత్యా అంగీకరించిన పక్షంలో ఈసభా సదులలో చాలామంది అందుకు బద్ధులై ఉండవలసియున్నది. ప్రభుత్వం అనుసరించవలసిన ఏకార్యక్రమం విషయంలో అయినా అంత్యనిర్ణయం చేసే అధికారం ఈ శాసనసభదేకాని అఖిలభారత కాంగ్రెసు కమిటీ ఒక నిర్ణయాన్ని చేసినప్పటికీ మాలోచాలామంది అతీర్పుకు, నిర్ణయానికి కట్టుబడి; అనిర్ణయమును శాసనసభే ఆమోదం నిమిత్తం ప్రతిపాదింపవలసి ఉంటుంది." అని ప్రధానామాత్యుడు స్పష్టంచేశారు. ప్రభుత్వం ఏకార్యక్రమాన్ని కొనసాగించినా ఏపథకాన్ని ప్రారంభించినా ఆర్థిక సంఖ్యాకుల అనుకూల్యం ఉండేటట్లుగా ఆపథకాలు కార్యక్రమాలు ఉండవలెనని అన్నారు. ఈ పద్ధతికి ఏ విధంగానూ అంతరాయం కలుగరాదనే విషయం మనస్సులో ఉంచుకొనే తమ అధ్యక్షుడు తన ఏర్పడిన కాంగ్రెస్ ఉపసంఘం నివేదిక తయారు చేయబడిందని ఈయన తెలియచేశారు. తీర్మానాన్ని ప్రతిపాదించిన కరముద్దీన్‌గారు కాంగ్రెస్ తీర్మానాల నుండే ప్రధానామాత్యుని ప్రసంగాలనుండి ఇతర అధినివేశ సంగ్రహాలనుండి కొన్ని భాగాల ఉల్లేఖించి అందున్న అసంబద్ధాలను విమర్శించి నందున పండిత్ నెహ్రూ ప్రభుత్వం తరపున విమర్శకు సమాధానం ఇస్తూ అలాంటి అసంబద్ధమైన ప్రకటనలు జరిగి ఉన్నట్లు అంగీకరిస్తూ అందుకు కారణం ఇప్పటివరకూ ప్రభుత్వం ఒక ఖచ్చితమైన నిర్ణయానికి రాకపోవడం, పారిశ్రామిక విధానం నిర్దిష్టంగా లేకపోవడం అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహించవలసినపనులు అనేకం వున్నవనీ ఆ కారణంగా దీర్ఘకాల సమస్యల సమగ్రంగా చర్చించి ఒక నిర్ణయానికి రావడం సాధ్యం గాకుండా వుందనీ చెప్పారు. "మనంసోషలిస్టులమని చెప్పుకోవచ్చు. మరేపేరైనా పెట్టుకొనవచ్చును. కాని సమస్యల పరిష్కారం దద్వారకు వచ్చేసరికి గాలికబుర్లు పనికి రావు" అని ప్రధానామాత్యుడు హెచ్చరించారు.

ప్రభుత్వం ఒక ప్లానింగ్ కమిషన్‌ను ఏర్పాటుచేయ సంకల్పించిందని తెలుపుతూ ప్రధానామాత్యుడిలా ప్రసంగించారు: ప్రభుత్వం పునరుద్ధరణ, అభివృద్ధి సంఘాన్ని స్థాపించింది. కాందిశీకుల పునరుద్ధరణ నుమాత్రమే ఈసంఘం ప్రధానంగా విచారింపవలసివున్నా, అందునిమిత్తం వివిధ అభివృద్ధి పథకాలను కార్యక్రమాలను విచారింప వలసి వుంటుంది. నేషనల్ ప్లానింగ్ కమిటీవారు అన్ని సమస్యలను దీర్ఘంగా విచారించి సమగ్రంగా చర్చించారు. అయితే ఒక సంపూర్ణ నివేదికమాత్రం తయారుకాలేదు. వివిధ ఉపసంఘాల నివేదికలు వివిధ విషయాలపై కమిటీ తీర్మానాలూ ఉన్నవి. వీటిని పరిశీలిస్తే ఈ కలాపంఅంతా చాలా చిక్కులతో కూడుకొనిఉన్నట్లు స్పష్టమౌతుంది. ఒక స్కూళ్లు, కళ్లు సమస్యలు పరిష్కారం కావు. కేవలం ప్రాయంగా ప్రభుత్వం ప్రకటనలుచేస్తూ ఉండలేదు. ప్రభుత్వం ఒకవిషయాన్ని వివిధకోణాలా విచారించి తక్షణం ఏమిచేయవలసిఉందో నిర్ణయించుకోవాలి.

అధికోత్పత్తే ప్రస్తుతావరం

"అధికోత్పత్తి ప్రస్తుతావరంఅనిఅనేక పర్యాయములు మేము ప్రకటించిఉన్నాము. ఉత్పత్తిని అధికంచేయడం ద్వారా, దేశసంపదను వృద్ధిచేసిన వారమవుతాము. ఇతరవిషయాలను అలక్ష్యంచేయడానికీలేదు గాని, అన్నింటికంటే ప్రధానమైనది ఉత్పత్తిని ఎక్కువచేయడం. పరిశ్రమల జాతీయం చేయడంవల్ల ఉత్పత్తి అధికమైతే తప్పకుండా అడుగడుగునా ఆకార్యక్రమాన్నే అనుసరిస్తాం. అలా గానిపక్షంలో ఉత్పత్తికి భంగంకలగకుండా ఈపనిని సాధించడం ఎలాగో విచారిద్దాం. ఇదే ప్రధానమైన విషయం. ముందు శాసనం చేసి ఏదో గారడీవల్ల ఫలితాలను సాధించగలమని తీర్మానాన్ని ప్రతిపాదించినవారు భావిస్తున్నారు. కాని అది అంత సులభమైన విషయంగాదు. అందువల్ల కేవలం ఒక ఆర్థిక దృక్పథాన్ని అలవర్చుకోవడం, ఒక విధానాన్ని అంగీకరించడంగాను ప్రధానం. అందుకు తగినసమయం ఏది? ఎలా చేయడం? ఏదిముందు? ఏది వెనక? ఇలాంటి అనేక విషయాలను విచారింపవలసి ఉంటుంది.

"ఈ తీర్మానం చాలా లోపభూయిష్టంగా ఉంది. అంతా అసందిగ్ధంగాఉంది. ప్రతిపాదకుని సహృదయాన్ని వెల్లడించడం మినహాగా ఈ తీర్మానం మరేవిషయాన్ని వెల్లడించడంలేదు పరిశ్రమలలోను స్వయపోషణంలోనూ తక్షణం ఏదో చేయాలని ఈ తీర్మానం కోరుతున్నది. ఆర్థిక విషయాలపై ప్రభుత్వాభిప్రాయాలు ఏ విధంగా ఉన్నప్పటికినీ, ఇలాంటి తీర్మానాన్ని ఏ ప్రభుత్వమైనా ఎలా అంగీకరించగలదో నే నూహింపలేకుండా ఉన్నాను. మనలో చాలామంది, ముఖ్యంగా నేను కేవలం భారత దేశంలోనేగాదు, ప్రపంచంలోని మరికొన్ని ప్రాంతాల్లోకూడా మన ఆర్థికస్థితులను శీఘ్రగతిని మార్పులు జరగాలని అభిప్రాయ పడుతున్నాం. అయితే మనదేశంలోనూ, ప్రపంచంలోని మరికొన్ని దేశాల్లోనూ కొందరు 19 వ శతాబ్దపు ఆర్థిక విధానాలకే అంటిపట్టుకొని ఉన్నారు. కాలానుగతమైన ఆర్థిక వ్యవస్థల నిర్మింపలేకపోవడం, విధానాలను మార్చుకోలేక పోవడమే మన రాజకీయ విషమ పరిస్థితులకు కారణం.

"అవి కన్నీళ్లు ఎలాఉన్నా మనం విచారించాల్సిందే విధ్వంసాత్మకమైన విమర్శగాదు నిర్మాణాత్మకమైన పథకాలను సృష్టిచేసుకోవాలి. అది మన దేశపరిస్థితులను, ప్రపంచ పరిస్థితులను గమనించి చేసుకోవాలి. మన దేశస్థితిగతులను విచారించుకొని జాగ్రత్తగా అడుగుతీసి అడుగువేసుకొంటూ ముందుకు సాగవలసి ఉంటుంది. దేన్నయినా నిర్మాణించడం తేలికగాని నిర్మించడం అంత సులభంగాదు."

కాంగ్రెస్ ఉపసంఘ నివేదికపై విమర్శలకు సమాధానం

తన అధ్యక్షుడు తన ఏర్పడిన కాంగ్రెస్ ఆర్థికోపసంఘం నివేదికను గురించి పండిత్ నెహ్రూ ఇలా మాట్లాడారు: "అతి శ్రద్ధగా, జాగ్రత్తగా ఈ నివేదిక తయారుచేయబడింది. అయితే ఈ నివేదికను ముందు కాంగ్రెస్ కార్యవర్గం ఆ తరువాత అఖిలభారత కాంగ్రెస్ కమిటీ విచారింపవలసి ఉంది. ఇదే వేదవాక్యం గాదనీ, అది కేవలం ఒక ప్రాతిపదికేననీ ఆ నివేదికలోనే స్పష్టం చేయబడింది. ఈ నివేదికను ప్రభుత్వం ఏర్పాటు చేయవలసిన ప్లానింగ్ కమిషన్ కూడా పరిశీలింపవలసి ఉంది.

"ఈ నివేదిక సామ్యవాదానికి చాలా దూరంగానే ఉంది ప్రపంచం అంతటా జరుగుతూ ఉన్న పరిణామానికి సంబంధించే ఉంది. ఈ నివేదిక సామ్యవాద ధోరణి మాత్రమే సూచిస్తున్నది. పైగా ఏ పని జరిగినా ఏచర్య తీసుకున్నా ఉత్పత్తికి భంగం కలుగకుండా ఉండాలనే ఈ నివేదికస్పష్టంగా హెచ్చరించింది. ఈనివేదిక కేవలం స్థూలంగా స్వరూపాన్ని మాత్రమే సూచించింది. మిగతా వివరాలన్నింటినీ ప్రభుత్వప్లానింగ్ కమిషన్ పూర్తిచేయవలసిఉంది"

పరిశ్రమల జాతీయం చేయడం గురించి మాట్లాడుతూ ఉన్న పరిశ్రమలను జాతీయం చేయడంతోనే తృప్తిపడితే అందు కే ప్రభుత్వ సాధనసంపత్తియంతనూ వినియోగించితే తీరా కొత్త పరిశ్రమలను ప్రారంభించవలసివచ్చే సరికి ప్రభుత్వం సాధనసంపత్తి ఏమీలేని కారణంగా అసహాయ స్థితిలో పడిపోగలదు. ప్రయివేటు పరిశ్రమలను అపి వేయనూవచ్చు. ప్రభుత్వం కూడా ఏమీ చేయలేకనూ పోవచ్చు. మనం వ్యవహారాలనుసరిగ్గా దిద్దుకోకపోతే, సన్యాసంగా నిర్వహింపకపోతే లక్షితి రాక తప్పదు. కనుక ఏవో కొన్ని పరిశ్రమలపై కేంద్రీకరించడం మంచిదిగాని, పాతవాటిని జాతీయం చేయడానికి పూనుకోవడం ప్రభుత్వానికి అంత మంచిదికాదు. ఉన్న పరిశ్రమల జోలికిపోక, కొత్త పరిశ్రమల విషయమై ప్రభుత్వం కృషిచేస్తే ఉన్నవాటికి కొత్తవిన్నోడై అధికోత్పత్తికి దోహదం చేసినట్లవుంది. కొన్నాళ్లు పోయిన తరువాత అన్నింటినీ సమగ్రంగా విచారింపవచ్చును. అప్పుడు ప్రభుత్వంతాను చేయకలిగిం దేమిటి? ఎంతవరకు చేయగలదు అనే విషయమై ఒక నిర్ణయానికి రావడానికి వీలవుతుంది. అయితేళ్ల తరువాత ఈ విషయం విచారింపవచ్చును. కాలపరిమితిని నిర్ణయించి నందువల్ల వుండేదేమీలేదు కాని ఎంతలో ఏపని ఎలా జరగగలదో ఊహించుకోడానికి వీలవుతుంది. అయితేళ్ల వరకూ ప్రస్తుత పరిశ్రమల విషయంలో ప్రభుత్వం విప్లవాత్మకమైన నిర్ణయం ఏమీచేయదని హామీ ఇవ్వడానికి కూడా ఇది ఉపయోగపడవచ్చును

"పెద్ద పెద్ద పారిశ్రామికులే నివేదికను విమర్శించడం చూచినేనాశ్చర్యపోయాను. పారిశ్రామికులదృష్ట్యాకూడా వివిధసమస్యల విచారించి, కమిటీ ఈనివేదికను తయారు చేసింది. తర్వాత విచారింపవచ్చునని కొన్ని అంశాలను వదలివేసి ఉండవచ్చును. ఈనివేదిక ప్రకటింపబడిన తర్వాత రిజర్వ్ బాంకును, ఇంపీరియల్ బాంకును జాతీయం చేయాలని ఈశాసనసభ తీర్మానించింది. అవిధంగా మార్పులు జరుగుతూనే ఉన్నవి. కేవలం మనం మార్పులు, మార్పులని ఘోషిస్తుంటే అసలు మార్పులు జరక్కనే పోవచ్చును. అందువల్ల జరుగవలసిందేమంటే ఇలాంటి తీర్మానాలను ఆమోదించడంగాదు, ఆలోచనల్ని నిర్వచించడం. ఆలక్ష్యంకూడా ఎప్పటికీ ఒకేలాగ ఉండటానికి వీల్లేదు. రకరకాలమార్పులు జరుగుతూ ఉన్నందున ఆలక్ష్యాన్ని గురించికూడామనంఎప్పటికప్పుడు విచారించుకూ వుండాలి శాస్త్రవిరోధనలనుగమనిస్తే దాదాపు 15 సంవత్సరాల్లో అసలు పరిశ్రమలతీరే మారిపోవచ్చునని తోస్తుంది. కొత్త శక్తులవస్తవి. అందువల్ల ఇప్పటి ఉత్పత్తి శక్తి, సాధనలు యాపయోగమై పోతవి కమ్యూనిస్టులుగా నివ్వండి, సోషలిస్టులుగా నివ్వండి, కాపిటలిస్టులుగా నివ్వండి ఎవరైనా ఈ రాబోవు బ్రహ్మాండమైన మార్పుల గురించి అంతగా విచారించడంలేదు. అందువల్లనే కొత్తపరిశ్రమల విషయమై ఆలోచించడానికి బదులు ఉన్నపరిశ్రమలయాజమాన్యాన్ని మార్చాలని అంటున్నారు. పంపకం ప్రధానమైందే కాని అంతకంటే ప్రధానమైనదేమంటే తక్షణక్షణం మారుతూ ఉన్న పరిస్థితులు, ఇప్పటున్న ఉత్పత్తి సాధనలు ఏవిధంగాఉన్నా ముందువచ్చే కొత్త ఉత్పత్తిసాధనలమాత్రం ప్రభుత్వం పరంగానే ఉండాలి. ఈ కొత్తసాధనలు ప్రయివేటు పరిశ్రమదారుల చేతుల్లోకి పోనివ్వరాదు.

"చిల్లర విషయాలపై ఉన్న శక్తిని వృథాచేయక అసలు విషయాలపై దృష్టిని శక్తిని కేంద్రీకరించాలి. సమయాన్ని బట్టి విధానాలను నిర్ణయించాలి. ఉన్న పరిశ్రమలను జాతీయంచేయడం ఎప్పుడుసాధ్యమవుతుందో చెప్పలేము. అందుకు అనుకూలమైన సమయం ఎప్పుడు గలదోకూడా చెప్పలేము. జాతీయం చేయడానికి కావల్సింది కేవలం డబ్బు మాత్రమేగాదు. సుశిక్షితులైన పనివారు కావాలి శిక్షణకు ఇతర దేశాలకు పంపి పనివారి సంఖ్యను వృద్ధిచేయడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తూఉంది. ఇతర దేశాల నుండి ప్రవీణులరప్పించి మన విద్యార్థులకు తర్ఫీదు ఇప్పించడానికి ప్రయత్నాలు జరుగుతూ ఉన్నవి. ఇదంతాకూడా భవిష్యదభివృద్ధికి పునాది."

భూమి అమరకపువిధాన సంస్కరణ

భూమి అమరకపు సంస్కరణ గురించి పండిత్ నెహ్రూ ఇలా చెప్పారు:

"జమీందారీ విధానాన్ని రద్దుచేయడం మా కార్యక్రమం. ఆ ప్రకారంగా పని జరిగిపోతూ ఉంది. అయితే అది చాలా మందగమనంకావచ్చు. అందుకు ప్రభుత్వలోపం కారణంకాదు. అనేకఇబ్బందులు, చిక్కులు తయారైనవి అయినా ఈ పని త్వరలోనే పూర్తి కాగలదనినాకవిశ్వాసం. పెద్దభారీ ఎత్తున కాకపోయినా, కొద్దిలో నేలయినాసహకార, పుమ్మడి సాగు పద్ధతులనుఅమలుజరుపగలం ఈపద్ధతులను అమలుపరచేపూర్వం భారతదేశంలో హెచ్చు ప్రాంతంలో ప్రస్తుతం అమలునందున్న భూమి అమరకపుపద్ధతి విధానాన్ని పూర్తిగా రద్దు చేయవలసివుంది. జమీందారీ సమస్య ఒకటి వుంది. అదిగాక అంత సులభమైనది కాని మరోవిధానంవుంది మనం ఏనిర్ణయంచేసినా బహుళంగా వున్న మనరైతాంగాన్ని మెడలువంచి బలవంతంగా అంగీకరింప చేయలేము. వారిని మన అభిప్రాయాలకు మార్చుకోవాలి. దానికి ప్రత్యక్షదర్శనాలద్వారా సహకార, సమష్టి సాగుపద్ధతి ప్రయోజనకరమైనదని మనం ఋజువుచేయాలి. భారతదేశం విశాలమైన భూభాగం. అందులో రకరకాల భూమి అమరకపుపద్ధతులుఒక్కటొక్కటే ఉంటూ ఉండవచ్చు. అన్నింటిలోకీ ఏది ఉత్తమమైందో మనదేశపరిస్థితులకు ఏదీ అనుకూలమైందో అదే నిలబడుతుంది.

"పరిశ్రమల విషయమై ప్రభుత్వం తన విధానాన్ని స్పష్టంచేయ సంకల్పించింది. ముందెన్నడో జరగబోయే వాటి విషయం చెప్పదలచలేదు. అది ఆనధికారసంఘాలు చేయవలసినపని. ముందు ముందిలా చేస్తామని ఇప్పుడు ప్రభుత్వం తీర్మానాలు చేయజాలదు. ఒక్క విషయంమాత్రం స్పష్టంచేయదలచినాను. ప్రభుత్వం ఏంచేసినా ఉత్పత్తి నధికం చేయడానికే అదే అత్యంత ప్రధానమైన విషయం. పరిశ్రమలను జాతీయం చేస్తే, వాటిని నిర్వహించడానికి మనుష్యులంటారా అని కొందరు ప్రశ్నిస్తుంటారు. ఇప్పుడు ఆయా పరిశ్రమలలో ఉన్నవారు దేశాన్ని వదలిపోవడంలేదు. పరిశ్రమలు జాతీయంఅయినా వారే ఆయాపనులను నిర్వహిస్తూ ఉంటారు."

క్రిప్స్ ప్రశంస

(1 వ పేజి తరువాయి)

డు. ప్రస్తుతంరాబోతున్న కష్టసమయాల్లో మనలనూ, ఆయన ప్రజలనూకూడా, ఆ మహత్తర నైతికశక్తి మాత్రమే రక్షించగలదు. ఆయన మరణం ప్రత్యక్షంగా కంటికి పెద్దనష్టమే. ఎందువల్లనంటే, వివిధ సమస్యలనూ పరిష్కరించుకొనటానికి ప్రేమమార్గమే మహోన్నతమైనదని తమ జీవితంద్వారా, తమచర్యలద్వారా, నిరూపించగలిగిన మహానాయకుడు, ప్రపంచములో ఆయన తప్పితే మరెవ్వరున్నారు? క్రిస్టియన్లమందరమూ అనుసరిస్తున్నామని చెప్పుకొంటున్న క్రీస్తు చెప్పినదానినేకదా గాంధీజీకూడా చెప్పినది!

ప్రపంచం ఆయన జీవితాన్నిచూసి ఈ ఒక్క అంశాన్నయినా నేర్చుకోవాలి: పశుబలంద్వారా ఆత్మరక్షణ చేసుకోవాలని ప్రయత్నించటం నిరర్థకం. ప్రేమయొక్క మహోన్నతశక్తే మనకు తరణోపాయం.

ఆయనదృష్టిలో అహింస

ఆయనదృష్టిలో 'అహింస' అనేది కేవలము 'హింస' చేయకపోవటమనే కాదు. చివరకు ప్రేమబలం తప్పకుండా జయిస్తుందని నిరూపించటంకూడా ఆయన దృష్టిలో 'అహింసే'. మతానికి మతమే, నిత్యజీవితానికి, నిత్యజీవితమే అన్న పద్ధతి కాదు ఆయనది. ఆయన జీవితమే మతమూ, మతమే ఆయన నిత్యజీవితం. ప్రపంచ జాతులన్నిటిలోనూ భారతజాతి హృదయాన్ని అర్థంచేసుకోగలిగినవారులేరు. కాని గాంధీజీ అపని చేయకలిగాడు. 'ఆత్మార్పణం' అనేది వారికి ఎంత ప్రియమయినదో ఆయన గ్రహించి, తానుచేసిన ప్రతిదాంట్లోనూ ఆ స్వార్థత్యాగానికే ప్రాధాన్యత ఇచ్చి, దాని ననుసరించే అన్నీ చేశాడు.

అమోఘాయుధం

తన ప్రజలమీద ఆయన ఉపయోగించే అమోఘమైన ఆయుధం నిరశనవ్రతం. ఇతరులుచేసిన తప్పులన్నిటికీ తానే బాధ్యతవహించి, ప్రాయశ్చిత్తం నిమిత్తం ఆయన నిరశనవ్రతాన్ని పూనేవాడు. ఆయన దురహంకారికాడు. కాని తాను చేసేది న్యాయమైనది అని తోచినప్పుడు ఆయన నిశ్చయాన్ని ఎవ్వరూ మార్చలేరు. తాను అనుసరించేది సత్యమార్గమని ఆయనకు తెలుసు. ఏకాగ్రచిత్తంతో ఆలోచించి, భగవంతుని ప్రార్థించి, ఆయన తన నిశ్చయాలకు వచ్చేవాడుకాని మిగిలినవారితో చర్చించటం మూలంగా కాదు.

తాను నిజమని నమ్మినదానిని ఆచరించటంలో ఆయనకు మించినవారెవరూ ప్రపంచంలో లేరు ఆయనను కలుసుకున్న ప్రతివ్యక్తికీ ఆయన స్నేహితుడే."

గాంధీజీకి ఇష్టమైనదీ, ఆయన ప్రార్థనలలో ఎక్కువగా పాడబడేదీ, ఆయనకు ఇంగ్లీష్ ప్రార్థనాగీతంలో సమావేశం ముగిసింది. "కరుణాపూరితమైన దివ్యజ్యోతీ! మాకు దారినిచూపు." అని ఆ గీతంఅర్థము

అబ్దుల్లా హెచ్చరిక

[1-వ పేజీ తరువాయి]

బారికి అప్పగించి వెళ్లిపోను. కాశ్మీర్ ప్రజలను రక్షించటానికి వచ్చిన భారత సైన్యం, అక్కడ శాంతపరిస్థితులు ఏర్పడే వరకూ తిరిగిపోవు.

భారత ముస్లింలకు హెచ్చరిక

భారతదేశంలో ముస్లిములకు ప్రత్యేక పార్టీ అవసరంలేదు. 'జాతీయముస్లిం' అనే మాటకు అర్థమేమిటో నాకు తెలియటంలేదు. 'మీరు పాకిస్థాన్ దేశప్రజలైతే పాకిస్థానీలవుతారు. భారతదేశానికి చెందితే భారతీయులవుతారు. భారతదేశం లోని ముస్లి

ఏలూరు గాంధీ జాతీయవిద్యాలయము

సక్రమనిర్వహణకు రంగాగారి ప్రయత్నము

ఏలూరు, ఫిబ్రవరి 8: సుమారు లక్ష రూపాయల మూలధనంతో, 1921 లో స్థాపింపబడి, 1939 వరకూ, ఏలూరులో రాజకీయోద్యమములకు కేంద్రంగా ఉండిన, గాంధీ ఆంధ్రజాతీయ మహావిద్యాలయ పరిపాలనా వ్యవహారములను గురించి బరచి, విద్యాలయ పరిమనిర్వాణకు ఏర్పాట్లు చేయు నిమిత్తము స్థానికులతో సంప్రదించుటకు రాష్ట్రకాంగ్రెసు అధ్యక్షుడు రంగాగారు ఈ ఉదయం యర్రగడకు వచ్చిరి. జిల్లా కాంగ్రెసు అధ్యక్షుడు కొమ్మారెడ్డి సూర్యనారాయణ, మాగంటి బాపినీడు గార్లు యితర ప్రముఖులు హాజరయిరి.

ఈ సంస్థ నిర్వహణము గత 10 సంవత్సరముల నుండి పరిగణింపక స్థానికుల ఉద్దేశము సరిగా జరుగుటలేదనీ, ఈ కాలంలో ఎన్నికలు వగైరా ఏమీ జరగలేదనీ రంగాగారికి తెలిపిరి.

రంగాగారు, ఆంధ్రదేశంలో పూజ్య గాంధీజీపేట, స్థాపించిన ఇటువంటి జాతీయ సంస్థలన్నింటినీ, సరిగా నిర్వహించుట అందరి విధియనున్నదనీ, విద్యాలయమును మళ్ళీ మువ్వురు సభ్యులు సమర్థులైన ఉపాధ్యాయులను భాగముగా నియమించి, ఈ జిల్లాలోని, రాష్ట్రంలోని కాంగ్రెసు సేవకులకు, గాంధీజీ సిద్ధాంతములు, బోధనలు, పద్ధతులు మొదలైనవానిమీద తర్ఫీదు యిచ్చే సంస్థగా ఏర్పాటు చేయవచ్చుననీ, అటువంటి శిక్షణ తరగతులు పం॥ నకు 3 పర్యాయములు పదుపరచవచ్చుననీ, అవిధంగా దేశంలో గాంధీజీ ప్రబోధించినరీతిగా దేశ సేవకులను తయారుచేయుట ఉచితం గా ఉండునని, గాంధీజీ వస్తుప్రదర్శనశాల, గ్రంథాలయమును కూడ యిందు ఏర్పరచి అవకాశములున్నవనీ, దీనికంతటికీ క్రొత్తపద్ధతిగా ముందు విద్యాలయ పరిపాలన సక్రమ మార్గంలో పెట్టకలేదనీ సూచించిరి. విద్యా విధానం విషయంలో ఆంధ్ర ప్రముఖులు తమకు తోచిన సూచనలను ఫిబ్రవరి నెల ఖరులోగా వలపరచినచో వీజ్ఞప్తి చేసెదరు.

తర్వాత, జిల్లా కాంగ్రెసు అధ్యక్షుడు, ప్రముఖ పౌరులవారి సహాయంతోనూ, పౌరుల సహకారంతోనూ, విద్యాలయ పరిపాలను సరియైన మార్గంలో పెట్టగలనని నిర్ణయించుకొన్నాను. (స్వ. వి)

ధర్మవరం సహకారబ్యాంకు తీర్మానం

ధర్మవరం కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ డైరెక్టర్లు బ్యాంకు భవనమందు 12 వ తేదీన ప్రసిడెంటు శ్రీ పొగాల బొప్పగారి అధ్యక్షతలను జరిపిన అవసర సమావేశమందు ఈ దిగువ తీర్మానము చేసిరి.

"సత్యము, అహింస, శాంతి, విశ్వమానవ సేవానిరతులును, మహనీయమూర్తియు పతితజనోద్ధారకుడును, భారతదేశ సమైక్యతా సాధకుడును, అఖండ నాతన చరిత్రయందు నిరుపమానమైన దేశసేవా నిరతుడును, త్యాగసేవామూర్తియు, భారతజాతీయ గౌరవ సంస్కృతులకు చిహ్నప్రాయుడును, భారతభాగ్యవిధాతయగు శ్రీ గాంధీ మహాత్ముని ఒక్క మతోన్మాదుడైన హిందువు క్రూరముగా తుపాకిగుండ్లకు బలి చేసి ఘోరహత్యానావరణమునకు గురిచేసినందుకు, ధర్మవరం కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ డైరెక్టర్లు తమ గాఢ సంతాపమును తెలియజేయుచు, భగవంతుడు మహాత్ముని ఆత్మకు సద్గతిశాంతిని చేకూర్చవలెనని ప్రార్థించుచున్నారు."

రాష్ట్ర మంతటా మద్యనిషేధం

బెజవాడ, ఫిబ్రవరి 7: శ్రీ కొయ్యూరు అచ్యుతరామగారిట్లు వ్రాసిరి:

మదరాసు ప్రభుత్వము మద్యపాననిషేధ కార్యక్రమమును రాష్ట్రమంతటా అమలు జరుపుకు నిశ్చయించుట మురాపకం. కాని ప్రభుత్వము ఒక విషయమును గమనించవలసియున్నది. కృష్ణా జిల్లాలో మద్య పానిషేధము అమలు జరుపబడిన పిమ్మట నూడ అనగా రాజీనామా ఆక్టోబరు తర్వాత కూడ ఒరిస్సారాష్ట్రము కు సప్లయి చేయు నిమిత్తం వుయ్యూరు బట్టీవారు సారాయి తయారు చేయుటకు ఉత్తరువులున్నవి కాబట్టి యీవిషయమై ప్రభుత్వము తగిన చర్యతీసుకొనవలెనని కోరుచున్నాను.

'కర్నూలు పట్నంలో రేషన్ రద్దు చేయవలెను'

కర్నూలు పౌరుల తీర్మానం

కర్నూలు ఫిబ్రవరి 16: ఈ పట్నంలో రేషన్ రద్దుచేసి ప్రజల కష్టములను తొలగించ వలసినదని ప్రభుత్వమును కోరుచూ నిన్న యర్రగడ శ్రీ డి సుబ్బారావుగారి అధ్యక్షతను జరిగిన బహిరంగ సభలో తీర్మానించిరి. సభకు పురప్రముఖులు అనేకులు హాజరైరి. ప్రజావసర వస్తువులన్నిటి మీదనూడ కంట్రోలు తొలగించ వలసినదని ప్రభుత్వమును కోరుచూ తీర్మానించిరి. ఈ తీర్మానములను ప్రభుత్వం అమలు జరపనియెడల రెండు మూడు నెలలు సత్యాగ్రహము చేసి అయినా తీర్మానములు అమలు జరుగునట్లు చూడవలెనని అధ్యక్షులు ఉద్బోధించిరి. (స్వ. వి)

తూర్పు కృష్ణాజిల్లా కాంగ్రెస్ కార్యాలయము మార్పు

మచిలీపట్నం, ఫిబ్రవరి 14: తూర్పు కృష్ణాజిల్లా కాంగ్రెస్ కార్యాలయము మచిలీపట్నం పద్మావతిలోకి ప్రక్క భవనములోనికి మార్చబడినదని శ్రీ పామిరెడ్డి వెంకటసుబ్బారావు రెడ్డిగారు వ్రాసిరి.

హరిజన దేవాలయ ప్రవేశం

ఏలూరు, ఫిబ్రవరి 14: పెందుర్రు ఫిర్కా గ్రామాభివృద్ధి కార్యక్రమానికి కేంద్రమైన జోగన్న పాలెములోని ఈశ్వరాలయంలో నేడు హరిజనులకు ప్రవేశమిచ్చిరి.

ట్రాక్టర్ల ప్రదర్శనం

నజరతుపేటలో కళా వెంకట్రావు గారి తెలుగు ప్రసంగం

పెరంబూర్, ఫిబ్రవరి 16: స్థానిక ఉత్పత్తి వినియోగదార సహకార సంఘము వారి ఆధ్వర్యమున, మదరాసు మంత్రులు గౌ॥ రామస్వామి రెడ్డియార్, గౌ॥ కళా వెంకట్రావు, గౌ॥ చంద్రమౌళీ, గౌ॥ భక్తవత్సలంగార్ల సమక్షమున నిన్న నజరత్ పేటలో ట్రాక్టర్ల ప్రదర్శనము ఏర్పాటు చేయబడెను. ప్రదర్శనమునకు పరుపురు జిల్లాధికారులు, ప్రభుత్వ శాఖోద్యోగులు, అనేకమంది వ్యవసాయదార్లు హాజరైరి. ట్రాక్టర్ల ఉపయోగమును గురించి సింధ్ అండ్ కంపెనీవారు ప్రేక్షకులకు విపులముగా తెలియజేయుచు, ట్రాక్టర్లను వ్యవసాయదారులందరు ఉపయోగించుటకు వీలుగా గ్రామములనుండి విద్యుచ్ఛక్తిని సరఫరా చేయించవలసిందని ప్రభుత్వమునకు విన్నవించిరి. మదరాసు రెవెన్యూ మంత్రి గౌ॥ కళా వెంకట్రావుగారు తెలుగులో ఉపన్యసించుచు, దేశములో జనాభా పెరుగుచున్నది గాని, ఆహార ఉత్పత్తిమాత్రం వృద్ధి చెందుట లేదనియు, పూర్వపు పద్ధతులనుబట్టి కాపుండా, నవీన పద్ధతులమీద వ్యవసాయమును అభివృద్ధిచేసి ఉత్పత్తి పెంచవలసినదనియు చెప్పిరి. వ్యవసాయదారులందరు సహకారపద్ధతిమీద నవీన వ్యవసాయ పరికరములను ట్రాక్టర్లతో వ్యవసాయము అభివృద్ధి చేయుచూనందు రెవెన్యూ మంత్రిగారు చెప్పిరి. మదరాసు సహకార శాఖ మంత్రి గౌ॥ చంద్రమౌళిగారు ఉపన్యసించుచు సహకారపద్ధతిమీద వ్యవసాయము అభివృద్ధి చేయవలసిన ఆవశ్యకతను గురించి చెప్పిరి. తరువాత గౌ॥ రామస్వామిరెడ్డియార్, గౌ॥ భక్తవత్సలంగారు ట్రాక్టర్ల ఉపయోగమును గురించి ఉపన్యసించిరి. శ్రీ సి. ఎస్. మధురం మొదలియార్ గారి వందనములతో ప్రదర్శనము ముగిసెను.

సభలు-సమావేశాలు

చెన్నపట్నం భూస్వాముల మహాసభ యీనెల 22 తే ఏలూరు హిందూయువజన సంఘాలలో జరుగును. శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డిగారు అధ్యక్షత వహించెదరు.

దివితాలూకా కైకలూరు కాంగ్రెసు మహాసభలలో ఒకటి యీనెల 21 తే అవనిగడ్డలోను, రెండవది యీనెల 22 తే చల్లపల్లిలోను జరుగునని శ్రీ పేకేటిరంగారెడ్డిగారు వ్రాసిరి.

పట్టణ వార్తలు

ఆహార సలహాసంఘాలు

ఆహారధాన్యాల కంట్రోలు తొలగించినందున ఆదనపు జిల్లాలను ఉభయగోదావరి కృష్ణ, నెల్లూరు గుంటూరు తంజావూరు జిల్లాలలో తాలూకా, జిల్లా ఆహార సంఘాలను ప్రభుత్వంవారు రద్దుచేసిరి.

ఇతర జిల్లాలందు సంఘాలు 1948 31 తేదీవరకు మార్పులేకుండా పనిచేయును.

ఆహారశాఖ కార్యదర్శి కుర్తాల లింగం పిళ్ళైగారి కార్యాలయమునందు ఇండియా ప్రభుత్వ ఆహారశాఖ కార్యదర్శి, యితర ఉద్యోగులు, మదరాసు ఉద్యోగులతో ఆహారపరిస్థితిని గూర్చి సోమవారంనాడు చర్చించిరి.

* * *

మదరాసునగరంలోకి ఒక్కపడిబియ్యమయినా పైగ్రామాలనుండి పెర్మిటు లేకుండా తెచ్చేవారు శిక్షార్హులగుదురని ప్రభుత్వంవారు ప్రకటించిరి.

* * *

ఇండియా ప్రభుత్వ ఆహారశాఖ మంత్రి జ. పొలరాంగారు తమిళనాడు కాంగ్రెసు కార్యవర్గం సభయందు ఉపన్యసించుచు- ఆధారధాన్యాల కంట్రోలు యంకను పూర్తిక తొలగించుట గూర్చి విచారించుటకును, ఆహార ధాన్యాల ఉత్పత్తి రాష్ట్రమంతట పెంపొందించుటకు తగు సూచనలు చేయుటకును, రెండు ఉపసంఘములు నియమించమని సూచించిరి:

* * *

సింధ్ కాందిశీకులకు మునిసిపలు, కార్పొరేషను మార్కెటులందు వ్యాపారం జరుపుకొనుటకు స్థలములు అభిమానించి యివ్వాలని మదరాసు ప్రభుత్వంవారు స్థానిక సంస్థల అధికారులకు సూచించిరి.

* * *

మదరాసు కార్పొరేషను సభ్యుల ఉద్యోగశాలపరిమితి 1948 ఆగస్టు 1 వరకు పెంచబడెను. ఓటరుల జాబితాప్రకటన మే 15 లోగా జరుగును.

* * *

ఒక ఘోరమైన భార్య ఇంద్రాణి అమ్మాళు, తాను పెంచుకొన్న 5 పిల్ల బాలిక, తనభర్తతో చాడీలు చెప్పుచున్నదని కోపించి చురకలువేయగా పోలీసువారామెను అరెస్టుచేసి, బాలికను, ఆస్పత్రికి పంపిరి.

జిన్నా ఆరోగ్యం

కరాచీ, ఫిబ్రవరి 16: జిన్నాసాహెబుగారి ఆరోగ్యం క్షీణించు చున్నదనియు వారిస్థానే భోపాలు నవాబుగారు పాకిస్తాను గవర్నరు జనరలుగా నియమింపబడుదురనియు ఇటీవల పత్రికలలో వార్తలు ప్రకటింపబడెను. జిన్నాగారి కార్యదర్శియగు యన్. యం. యూసఫ్‌గారిని యీవిషయమై ప్రశ్నించగా ఆ వార్తలన్నియు శుద్ధ అబద్ధములనియు జిన్నాగారు తెలూచిస్తాన్‌యందు 5 దినములు పర్యటననుచేసి నిన్ననే కరాచీకి తిరిగి వచ్చిరనియు చెప్పెను.

జిన్నాగారి స్థానే క్రొత్త గవర్నరుజనరలు వచ్చునా?

జిన్నాగారు పాకిస్తాన్ గవర్నరు జనరలు పదవినుండి విరమించెదరనియు వారిస్థానే భోపాలు నవాబుగారు ఆ పదవికి వచ్చెదరనియు ప్రకటింపబడిన వదంతులు నిజమేనా యని ప్రశ్నింపగా లండనులోనున్న పాకిస్తాను హైకమీషనరగు హబీబు ఇబ్రహీం రహీంతుల్లాగారు అది ఎంత మాత్రము నిజము కాదనిరి.

ప్రస్తుతము పరిహద్దురాష్ట్రి గవర్నరుగానున్న సర్ జార్జి కన్నింగుహాంగారికి పాకిస్తాను గవర్నరు జనరలు పదవినిచ్చెదమని చెప్పగా వారు ఆపదవిని నిరాకరించిరని లండనులోని డెయిలీమెయిలు పత్రికా తాలూకు రావ్వాండి విలేఖరి ఆ పత్రికకు వ్రాసెను.

కాంగ్రెస్ నిర్మాణ కార్యక్రమ సేవకుల సమావేశం

వార్ధా, ఫిబ్రవరి 16: కాంగ్రెస్ నిర్మాణ కార్యక్రమ సేవకుల సమావేశం ఒకటి మార్చి 12, 14 తేదీలలో వార్ధాలో జరుగనుంది దీనిలో కాంగ్రెస్ అధ్యక్షుడు డా॥ రాజేంద్రప్రసాద్, ప్రధానిజెహ్రూ, సర్దార్ పటేల్, శంకర్ రావుదేవ్ మొదలైనవారు పాల్గొంటారు. విరేకాక అఖిల భారత గ్రామ, కుటీరముల సంఘం, చరకా సంఘం, హరిజన సేవకసంఘం, నయీతాలీమీసంఘం, గోసేవాసంఘాల ప్రతినిధులు పాల్గొంటారు. గాంధీజీ నిర్మాణ కార్యక్రమాన్ని ఈసంస్థలద్వారా ఆచరణలో పెట్టేతదుపరి మార్గాలను ఈ సమావేశం ఆలోచిస్తుంది. (యు. పి. ఐ)

సావంత్వాడి సంస్థానం

కొల్హాపూర్, ఫిబ్రవరి 16: సావంత్వాడి సంస్థాన ప్రజాపరిషత్తు, (దక్కన్) సంస్థానమును ఇండియన్ యూనియన్‌లో కలిపివేయవలసిందని మహారాజుకు కోరుచూ ఒకతీర్మానం చేసింది. మహారాజా సత్వరనిర్ణయాలకు పూనుకోకపోతే, పరిషత్కార్యవర్గమే ఆపని చేయవలసి వస్తుందని హెచ్చరించింది.

మహాత్ముని జీవితం: డాక్యుమెంటరీ ఫిల్మ్

లండన్, ఫిబ్రవరి 14: మహాత్ముని జీవితాన్ని ఒక చిన్న డాక్యుమెంటరీ ఫిల్మ్‌గా తయారుచేయడానికి లండన్‌లో 'ఈస్ట్‌వెస్ట్ ఫిల్మ్ కంపెనీ' సంకల్పించింది

పురుషోత్తమ పట్నం గోపీనాథస్వామి దేవాలయము ధర్మకర్తలను తొలగించి గుంటూరుజిల్లా దేవాలయపు బోర్డు అసిస్టెంటు కమీషనరే ఆలయ నిర్వాహకము వహించవలెనని ఉత్తరువు చేయడమయినది.

* * *

శ్రీ కళా వెంకట్రావుగారు 21 తేదీ రాత్రి మదరాసువిడచి తిరుచునాపల్లి జిల్లాకుపోయి 23 తేదీ తిరిగివత్తురు.

* * *

శ్రీ పద్మశాలి సంఘం

మదరాసు, ఫిబ్రవరి 15: శ్రీ దామోదర కృష్ణమూర్తి యం. యల్. ఏ. గారి అధ్యక్షతన శ్రీ పద్మజ్యోతి పత్రికా కార్యాలయమున నెం. 11, ఆళ్వారుపేట తిరుత్తయ్యమొదలివీధిలో నేటి సాయంకాలము 4 గంటలకు మద్రాసు పద్మశాలి సంఘ సాధారణ సమావేశము జరుపబడి సంఘాభివృద్ధికై కృషిసల్పుటకు పాలకవర్గ మొకటి యేర్పడెను. అధ్యక్షులు: శ్రీ నూకల రంగయ్యగారు, ఉపాధ్యక్షులు: డాక్టర్ అన్నచ్చి గోపాలకృష్ణయ్యగారు కార్యదర్శి: శ్రీ వణ్ణాల చిన్నయ్యశ్రేష్ఠిగారు, సహాయ కార్యదర్శి: శ్రీ మార్కాపురం శ్రీరాములు శ్రేష్ఠిగారు, కోశాధికారి: శ్రీ నల్లి నారాయణస్వామి శ్రేష్ఠిగారు. మరి 7 గురు కార్యవర్గ సభ్యులు ఎన్నుకొనబడిరి.

* * *

ఉద్యోగుల మార్పులు

రా. బ., బి. ఆర్. సోమయాజులు గారు మార్చి 1 వ తేదీనుండి మదరాసు ఎలక్ట్రికు సిస్టం సూపరింటెండింగు ఇంజనీరుగ పనిచేయుచూరు.

కె. ఎ. కన్నయ్య నాయుడుగారు ఈంగభద్ర ప్రాజెక్టు స్పెషలు ఇంజనీరుగ నియమింపబడిరి.

నట్లు తెలుస్తున్నది. కొన్ని నెలలలోనే సుచిత్రం తయారవుతుందట ఈ కంపెనీ ప్రొడ్యూసర్లలో ఒకడైన విష్ణుసెన్ కావలసిన పరికరాలను సమకూర్చడానికి ఇండియాకు బయలుదేరి వెళ్లాడు. (యు. ప్రె.)

బి. బి. సి. లో బాపూజీ జీవిత గాథాప్రచారం

లండన్, ఫిబ్రవరి 15: బి. బి. సి. (బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్) వారు ఈ మధ్య తమ వార్తా ప్రసార కాలంలో ఎక్కువభాగం మహాత్ముని అంత్యక్రియలను గురించీ, అస్థి ప్రక్షేపమును గూర్చి వినియోగించారు. త్వరలో గాంధీజీ జీవిత చరిత్రను గూడా సంపూర్ణంగా ప్రసారం చేయదలచు కొన్నారని తెలుస్తోంది. దీనికి కావలసిన వివరాలన్నిటినీ వారు సమకూర్చుకున్నారు-లోబ్.

మదరాసు ధరలు

మదరాసు, ఫిబ్రవరి 18:

వేరుసెనగ: (531 పౌ 1-కి ఎక్సు కోస్తా గిడ్డంగులు) మెషిన్ (సేల్స్‌టాక్సుతో సహా) రు. 133, 135

వేరుసెనగనూనె: ఎక్సుపెల్లర్ సేల్స్‌టాక్సుతోసహా) రు. 290-0-0 (టేల్-కోల్)

ఆముదం బజారుడెలివరి ఎక్సుపెల్లర్ బర్ ఇంగ్లీషుకాండి 500 పౌనులు గలది రు. 365,370

టెంకాయనూనె (89 పౌను గల డబ్బా) రు. 23-8-9

బంగారు-వెండి నేటి మధ్యాహ్నం 1 గంటకు సవరను 1-కి ఎడ్వర్డు బొమ్మ సేల్స్‌టాక్సుతో సహా వెల 68-14-0 పెట్లా బంగారు తులం 106-0-0 మూసబంగారు 104-8-0. సిమవెండి తులం 100-కి (రెడి) 149-8-0 తులం వెండి 1-కి 1-8-6.

న్యూయార్కు దూది

న్యూయార్కు, ఫిబ్రవరి 17: మార్చి 31 82/31.84 మే 32.11/32.12, జూలై 31.58/ ఆక్టోబరు 29.47/29.47 డిసంబరు 29.19/ నా. మార్చి 28.96/నా. మే 28.71నా. జూలై 28.20,నా॥

మిడ్లింగ్ హోజరు 32.87
మార్చి (గరిష్ఠధర) 32.35
(కనిష్ఠధర) 31.78

మార్చి వాయిదా ధరలు

నేటి ప్రారంభం	వెల	32 35
నిన్న		31.90
,, ముగింపు	వెల	31.82
నిన్న		32.28

వెలువడుతుంది మార్చి మొదటివారంలో

విశాలాంధ్ర

(సాహిత్య ప్రధాన మాసపత్రిక)

సంపాదకుడు: నెట్టి ఈశ్వరరావు.

మొదటి సంచికలో రచయితలు: శ్రీ శ్రీ, కొడవటిగంటి, తెన్నేటి సూరి, ఆత్రేయ, ఈశ్వరరావు, నార్ల చిరంజీవి, కొండముది గోపాలరాయశర్మ మొదలైనవారు. విడిప్రతి: పావలా. పుటలు అరవై. సం॥ చందా 3 రు/-

శ్రీ వి. సోలియప్ప మొదలియారు
మైలాపూర్, మద్రాస్ 4.

బెల్ బ్రాండ్

ALAGAPPA INDUSTRIES MADRAS

అల్యూమినియంసామానులు నిర్దోషమయినవి, శుద్ధమయినవి. మాన్యుఫాక్చరర్లవద్ద అన్నిరకములు దొరుకును. అలగప్ప ఇండస్ట్రీయల్సు 45. బి. తియవత్తూరు హైరోడ్, పెరంబూరు మన్‌పేట, మదరాసు.

జనరేయా మిక్చర్

సరోగసులనుగ్గారంటగా కలుగు
ఔషధం 1 కి రు 3-0
ఫుడ్ మెడికల్ హాల్, చెన్నై



ఉక్కు — భారతీయ కర్షకుడు..

భారతదేశమందలి వ్యవసాయము వర్షాకాలముపై ఆధారపడియున్నది. క్రమమైన నీటి పారుదల ఏర్పాట్లు లేకుండుటచే కొన్ని ప్రాంతములకు చాలా విలువయిన వర్షపునీరు విశేషముగా వ్యర్థమగుచున్నది.

పెద్ద డాములు, ఆనకట్టలువల్లనే పొలాలకు క్రమపద్ధతిని నీరు సప్లయి అగును. వాటి నిర్మాణములో ఉక్కు విశేషముగా వాడబడును. వర్షములు కురిసినప్పుడు అవి నీటిని నిలువచేసి అనావృష్టివల్ల కలుగు అపాయములను చాలావరకు తగ్గించును.



అట్టి ప్రాజెక్టులలో బెంగాలులోని దామోదరు రివరు స్కీము ఒకటి. ఇచ్చట నదీ ప్రవాహమును తరికట్టుట కలన వరదలు లేకుండా చేయబడి, వ్యవసాయోపయోగముకై ఆ నీరు పొరుదల చేయబడును.

ఉక్కుతో చేయబడిన పనిముట్లు, సాధనములు, యంత్రములు మరియు భారతీయ కర్షకునకు తోడ్పడును. ఆధునిక ట్రాక్టర్లు, రీపర్లు, బలమైన ఉక్కు నాగళ్లు, పండ్ల కోలలతో తరుచు తన పొలమునుండి ఇప్పుడు పండేదానికంటే అనేకరెట్లు ఎక్కువపంట వచ్చేటట్లుగా చేయగలంగుతాడు. ఉక్కుతో బలిష్ఠముగా నొనర్చబడిన ధాన్యపు కొట్లు అకని పంటను క్రిములు, ఎలుకలు, నీరు, నిప్పులనుండి రక్షించును.



ఇతరదేశమందలి వ్యవసాయదారులు ఆధునిక పద్ధతులతో ఎకరానికి ఎక్కువ పంట పొందుటను ఈ చిత్రము సూచించును. అంతే గానీ అంత కంటే ఎక్కువ గానీ ఉత్పత్తి ప్రమాణమునకు భారతీయ వ్యవసాయము తెచ్చుటలో ఉక్కుగూడా సహాయకారియగును.

తాతా ఉక్కు

TATA STEEL

ప్లేట్లు, కమ్మీలు, దూలాలు, రేకులు, పైకప్పు కడ్డీలు, చక్రపు పట్టాలు, ఇరుసులు, హైకార్బన్ స్టీల్సు, ప్రత్యేకపు మిశ్రమపు లోహ ఉక్కు, పనిముట్ల ఉక్కు, వ్యవసాయపు పరికరములు.

ది తాతా ఐరన్ & స్టీల్ కంపెనీ లిమిటెడ్., ప్రధాన సేల్సుఆఫీసు, 102 ఎ, నేతాజీ సుభాస్‌రోడ్డు, కలకత్తా.

దగ్గుకు ప్రభల నిరోధి.

కోడిన్-టెర్పి-వసాకా

లిలిడిక్ కెమికల్ వర్క్సు కంపెనీ లిమిటెడ్, బరోడా.

బాపూజీ అస్థి నిమజ్జన జాతీయ పరిదేవన దినం

హిందూపురం

ఫిబ్రవరి 14: మహాత్మా గాంధి అస్థి నిమజ్జన, జాతీయ పరిదేవన దినమునాడిచ్చటి సేవామందిరమునకు, సైసూరు సంస్థాన కాంగ్రెసువారు తమకొసగబడిన బాపూజీ చితాభస్మములో కొంత పంపిరి. ఆ భస్మమును పైలుస్టేషనునుంచి ఈ పట్టణ వీధులలో ఊరేగించుచు సేవామందిరమునకు కొనిపోయిరి. అచ్చట నిర్మింపబోవు మహాత్ముని స్మారకచిహ్నమునందు ఈ భస్మమును నిలవచేసెదరు.

నంద్యాల

ఫిబ్రవరి 14: జాతీయ పరిదేవన దినము నాడిచ్చట ఉదయము గాంధీజీ పటముతో ఊరేగింపు జరిగెను. పిమ్మట చాలామంది ప్రజలు పట్టణము వెలుపలి చెరువుప్రదేశమునకు వెళ్ళి స్నానములుచేసి ప్రార్థనలు జరిపిరి. కాఫీహోటళ్ళ సంఘం, వర్తక వైశ్య సమాజంవారలు బీదలకు అన్నదానము చేసిరి. సాయంత్రం బహిరంగసభలో పలువురు బాపూజీకి జోహారర్పిస్తూ ఉపన్యాసములు చేసిరి. రాత్రి తెల్లవారుదేవాలయములు, చర్చిలలో ప్రార్థనలు భజనలు జరిగెను.

చిలకలూరిపేట

ఫిబ్రవరి 14: బాపూజీ ఆత్మశాంతికై సాయంకాలము 10-వ తేదీన నగరమంతటా ఊరేగుతూ స్వతంత్ర మైదానమునందు వెళ్ళి ప్రార్థనలు జరిపి, సమీపంలో వున్న గాంధివిగ్రహమునకద్ద త్రివర్ణ పతాకము ఎగురవేసి హిందూముస్లిం ఐక్యత కోసము పాటుపడెదమని ప్రమాణములు గైకొనిరి. 4 బస్తాలబియ్యం పోలంచేసి బీదలకు అన్నదానము చేసిరి. తిరిగి 13 వ తేదీన గ్రామస్థులంతా సమిష్టిగా 50 బస్తాలబియ్యం పోగు చేసి అన్నదానము చేసిరి.

బి. ఎన్. రైల్వే ఉద్యోగుల జోహారులు

నాగపూర్, ఫిబ్రవరి 14: బెంగాలు నాగపూర్ రైల్వే స్థానిక ఉద్యోగులు 12-వ అయ్యగారి అప్పారావుగారి అధ్యక్షతను సభజరిపి బాపూజీకి జోహారు లర్పించిరి. హిందూ, క్రైస్తవ, ముస్లిం మతగ్రంథములనుంచి ప్రార్థనలు జరిపిరి. జి. హెచ్. కంట్రాక్టరు గాంధీజీకి జోహారుల్పించుచు రైల్వే ఉద్యోగులంతా గాంధీజీ బోధనలను అనుసరించవలెనని, జి. చక్రపాణిగారు కూడ ఉపన్యసించిరి. గాంధీజీకి ఇష్టమైన ప్రార్థనలు చేయుటతో సభముగిసెను.

నూజివీడు

నూజివీడు, ఫిబ్రవరి 14: బాపూజీ అస్థి నిమజ్జనరోజున ఇచ్చట పొద్దున నగరసంకీర్తన, ఊరేగింపు జరిగెను. 9 గం. కు మహాత్మాగాంధిపార్కు శంఖుస్థాపన జరిగెను. 12 గం. కు సేతాజీ చౌకలో బాపుజీ పేరనృపత్సర్జనము చేసిరి. మధ్యాహ్నము కొత్తి పేటలోని బాపుజీ చౌకలోను, హైస్కూలు ఆవరణలోను గాంధిజీ విగ్రహ ప్రతిష్ఠ జరిగెను. శ్రీనివాస పిక్చర్ హాలెన్‌లో బాపుజీ విగ్రహ ప్రతిష్ఠకు శంఖుస్థాపన జరిగెను. రాత్రి సింహాద్రిబసవలింగాచారిగారు గాంధి జీవితము కథా కాలక్షేపము చేసిరి.

ఖర్గపురం

ఖర్గపురం, ఫిబ్రవరి 14: బాపుజీ అస్థి నిమజ్జనదినమున ఇచ్చట పట్టణ కాంగ్రెసు ప్రతినిధి రామచంద్రరావు పంతులుగారి యాజమాన్యమున భజనలు ఊరేగింపులు, పేదలకు అన్నదానము సర్వజనుల సమక్షి భోజనములు జరిగెను.

తాడేపల్లిగూడెం

ఫిబ్రవరి 12: నేడు ఇచ్చట బీదలకు అన్నసంతర్పణ జరిగెను. శ్రీమతి కొచ్చర్లి కనకమ్మగారి అధ్యక్షతను సభ జరిగెను. సభలో పలువురు మహాత్ముని గురించి ప్రసంగించిరి. పట్టణములోని పూర్తి హర్తాళ్ జరిగెను. ప్రయాణ సౌకర్యములు కూడ నిలిచిపోయెను.

పాలకొల్లు

ఫిబ్రవరి 13: నిన్న ఈ పట్టణ కాంగ్రెసువారి యాజమాన్యమున పూర్తిగా హర్తాళ్ జరిగెను. భజనలతోను, ప్రార్థనలతోను గాంధీజీ విగ్రహమునద్ద శ్రీ పద్దిల్లి సత్యనారాయణగారి వారి 10 బస్తాల బియ్యము అన్నసంతర్పణ జరిగెను. సాయంకాలము గొప్ప బహిరంగ సభ జరిపి మాలకొల్లు పౌరులు తమ భక్తిశ్రద్ధలు తెలియజేస్తూ గాంధీమహాత్ముని అడుగుజాడలలో నడిచెదమని ప్రతిజ్ఞ గైకొనిరి.

చేబ్రోలు

ఫిబ్రవరి 13: ఇచ్చట నిన్న ఉదయం ప్రార్థనలు, దేవాలయములలో అర్చనలు అభిషేకములు జరుపబడినవి. బాపూజీ యీ గ్రామంలో శంకుస్థాపన చేసిన సారస్వత నికేతన గ్రంథాలయములో భజనలు మాత్రయజ్ఞము జరిగెను. మధ్యాహ్నము గొల్లపూడి బాధకృష్ణయ్యగారు బీదలకు అన్నదానము గావించిరి. సాయంత్రము గాంధీజీ పటములతో ఊరేగింపు, అనంతరము సభ జరిగెను. బాపూజీ గుణగణములు గురించి పలువురు ఉపన్యసించిరి.

ఏజెన్సీ పోలవరం

ఫిబ్రవరి 13: మహాత్ముని అస్థికలు నదిలో కలుపు మహోత్సవం పోలవరంలోను పైడిపాక మున్నగు తాలూకాలోని అన్ని గ్రామములలోను అతి విజయప్రదముగా జరిగినది. స్వరాజ్య ఆశ్రమంలో ప్రార్థన సూత్రయజ్ఞం, సభజరిగినది. మధ్యాహ్నం 12 గంటలకు గోదావరినదికి పురజనులు హిందువులు మహమ్మదీయులు అన్ని మతములవారు వెళ్లి స్నాన తర్పణములు జరిపిరి. హైస్కూలు మైదానములో సుమారు 5 వేల మందికి అన్నదానం చేయబడినది.

నరసరావుపేట

ఫిబ్రవరి, 13: నిన్న యీగ్రామంలో స్కూలుపిల్లలు, వుద్యోగ, వుద్యోగేతరులు గాంధిగారి శిలావిగ్రహము తీసుకుని పురవీధులయందు ఊరేగి, స్థానిక పెద్ద చెరువువద్దకు చేరి, అచట వేదమంత్రములతో గాంధిజీకి శ్రాద్ధకర్మ జరిపి కొంత మంది స్నానాదులుచేసి, తిరిగి అందరు మునిసిపల్ ఆఫీసువద్దకు వచ్చిరి. ఆఫీసుకు యెదురుగా హైరోడ్డుమీద శ్రీ గాంధి మహాత్ముని విగ్రహమును ప్రతిష్ఠించిరి. ఈ సందర్భమున స్థానిక మరాయిదర్జీలలో కొందరు శ్రీ పొట్టిమూర్తి సదాశివయ్యగారు సుమారు 3,000 మంది బీదసాదలకు అన్నదానము చేసిరి. స్థానికమహమ్మదీయులు తమ మసీదులయందు ప్రత్యేక ప్రార్థనలు జరిపి కొందరు బీదలకు అన్నదానమొనర్చిరి. సాయంత్రము స్థానిక కమ్యూనిస్టుపార్టి వారు బహిరంగసభను జరిపి మహాత్ముని గుణగణములను గురించి పలువురు మాట్లాడిరి. నిన్న యిచట సంపూర్ణ హర్తాళ్ జరిగినది.

చేగిరెడ్డి బాలిరెడ్డిగారి ప్రకటన

ఢిల్లీ, ఫిబ్రవరి 13: అఖిల భారత గ్రామీణసంస్థల సమాఖ్యకార్యదర్శి చేగిరెడ్డి బాలిరెడ్డిగారట్లు వ్రాసిరి.

రైతులవృత్తి స్వాతంత్ర్య పోరాటం వైపు మరలిట్టు చేసినది బాపూజీయే. రైతుల్లో పోరాటశక్తి కలదని మొదటి సారిగా చాంపారన్ రైతు పోరాటం ద్వారా ప్రపంచానికి చాటాడు. గ్రామోద్ధరణయే కాంగ్రెసు ఆశయమని, కాంగ్రెసు కార్యకలాపాలన్నింటినీ గ్రామాల వైపు త్రిప్పారు.

గాంధీజీ ఆశయమైన 'రైతు-కూలీ ప్రజారాజ్య స్థాపనకు రైతులంతా, యిసుమంతించిన శక్తిసామర్థ్యాలతో కృషిచేయాలి. బాపూజీ నూరాంతో అన్ని వర్గాలవారు, రైతులే యెక్కువ నష్టపడ్డారు. వారి ఆత్మ యెల్లప్పుడూ రైతాంగపు శ్రేయస్సునే వాంఛిస్తూ వుంటుంది."

గాంధిజీ స్మృతిచిహ్న స్థాపనకు సన్నాహములు

చీరాల, ఫిబ్రవరి 14: ఇచ్చట మహాత్మా గాంధి స్మృతిచిహ్నస్థాపనకు సన్నాహములు చురుకుగా జరుగుచున్నవి. 11 వ తేదీన పంచాయతీ బోర్డువారు ప్రత్యేక సమావేశంజరిపి, బాపుజీమృతికి సంతాపం వెలిపుచ్చుచూ, ఆయనస్మృతి చిహ్నముగ స్థానిక బాలికా పాఠశాల సమీపచౌకలో 5 వేల ఖర్చుపెట్టి స్థూపము ప్రతిష్ఠించ తీర్మానించిరి. అంతకుముందు మహాలక్ష్మమ్మ చెట్టువద్ద జరిగిన బహిరంగసభలో మహాత్ముని విగ్రహము నచ్చట ప్రతిష్ఠించవలెనని తీర్మానము జరిగెను. 5 వేల రూపాయలు వసూలుచేయ పలుపెట్టిరి. సభలోనే రూ 500/-లకు జాబితా తయారు అయ్యెను.

"బాపూజీ గురుపూజ"

గూడూరు, ఫిబ్రవరి 11: జాతీయ విద్యాకుటీరము సంచాలకుడు, సర్వోదయ వీరసు బ్రహ్మణ్యంగారు నేడు 'బాపూజీ గురుపూజ' కార్యక్రమ జరిపించిరి. సత్యాగ్రహులు పట్టణ, తాలూకా కాంగ్రెసు ప్రముఖ వ్యక్తులందరు పాల్గొనిరి. బాపూజీ మట్టి విగ్రహమునకు పంచామృత పాదపూజ జరిగెను. గీతాశ్లోకములు పఠించిరి. బాలికలు రామధునీ సంకీర్తన చేసిరి. వీరసుబ్రహ్మణ్యంగారు పూజానంతరము మాట్లాడుచు- గాంధీ మహాత్ముని నిష్కళంక ప్రార్థనా దర్శమును, ఆవశ్యకతను వివరించిరి. నాడు ఎట్టి ప్రజారాజ్యమును కోరుచుండిరో, సత్యాగ్రహుల బాధ్యత ఏదో తెలియజేసిరి. ప్రతి సత్యాగ్రహుడు కుటుంబక్షేమ భగవద్గీతను కొనుక్కొని నడిచిరి. గీతా సంఘాధ్యక్షులు, పట్టణ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ పొన్నలూరు వీరరాఘవ రెడ్డిగారికి కాశీనాథుని నాగేశ్వరరావుగారు రచించిన భగవద్గీత బహూకరించిరి. డిప్యూటీ కలెక్టరుగారికి పైత మొగ భగవద్గీతనిచ్చిరి. జాతిపర్ణ వితరణలేకుండా పంక్తి భోజనములు జరిగెను. కొద్ది మందికి అన్నదానము జరిగెను.

గాంధీజీ అవతార పురుషుడు

ఆయన ఆదర్శములను అనుసరించమని నాయకుల ఉద్బోధ

మదరాసు, ఫిబ్రవరి 17: "శ్రీరాముడు, శ్రీకృష్ణుడువలె గాంధీమహాత్ముడు కూడా అవతార పురుషుడు. మానవజన్మనెత్తినవారు సత్కర్మములచే మానవుడు సైద్ధాంతమును సాధింపవచ్చునని ఆయన తన జీవితమున నిరూపించెను. మహాత్ముడు బోధించిన సత్యము అహింసా సూత్రములను సరిగా అనుసరించి నీతితో ప్రవర్తించుటకు యత్నించితేనే మనము గాంధీజీ పరియైన అనుచరులగుదుము" అని ప్రధాని శ్రీ టి. వి. రామస్వామి రెడ్డియార్ గారు సన్నగాత్రి తిరువల్లిక్కేణి పార్థసారథి దేవాలయమెదుట తిరువల్లిక్కేణి యువకసంఘం ఏర్పాటుచేసిన స్మారకసభలో ఉపన్యసిస్తూ పలికిరి. శ్రీ కే. శతగోపన్ గారు ఈ సభకు అధ్యక్షత వహించిరి.

శ్రీ రెడ్డియార్ గారు మహాత్ముని మహత్తు వివరించుచు పలసిన అవసరమేదనియు, ప్రజలు మరణవార్త ప్రజలను ఎంత పరితపింపచేసినదనే సంగతి మాసే మహాత్ముని యెడల ప్రజలకు ఎంతటి ప్రేమయుండెనో నిదర్శనం తెలిపుతుందనిరి. ప్రజలు మహాత్ముని నిజంగా ప్రేమించియున్నట్లయితే ఆయన తెలిపిన నిర్మాణ కార్యక్రమమును పూర్తిగా అనుసరించితే తప్ప మహాత్ముని గౌరవించినవారు కాజాలరనిరి. మంత్రి శ్రీ యం. భక్తవత్సలం గారు గాంధీజీ మహాత్ములలో కెల్ల ఉత్తమ మహాత్ముడనియు దేశసేవయే ఆయన తన పరమావధిగా నుంచుకొని యే దినమున దేశమునకు స్వాతంత్ర్యమును పాధించగల్గితో అట్టి కార్యక్రమమును ప్రజలందరు అలవరచుకోవాలని కోరిరి.

రెవిన్యూమంత్రి శ్రీ కళావెంకట్రావుగారు ప్రసంగిస్తూ గాంధీజీ వెనకటి సత్యాగ్రహులలో తన ముక్తికై ఆ సాధనమును చేపట్టలేదనియు ప్రపంచంలో ఆత్మబలంగల సామ్రాజ్యమును లొంగదీయుటకే ఆయన సత్యాగ్రహమనే అస్త్రమును ఉపయోగించెనని రి. గాంధిమహాత్ముడు లోకోత్తర పురుషుడుగా వెలసిల్లెననియు నిష్కామకర్మలను ఆయన మనకందరికి ఉద్బోధించెననియు ప్రజలు ఆతని అడుగుజాడలను అనుసరించి తమ విధ్యుక్తధర్మమును నెరవేర్చవలెననికోరిరి.

శ్రీ కామరాజ్ నాడార్ గారు గాంధీజీ మరణానంతరం శాంతి సౌభ్రాతృత్వములకు ప్రజలు అనుసరించవలెనని విన్నవించిరి.

శ్రీ యం. సి. శ్రీనివాసన్ గారు భగవద్గీతలోని శ్లోకాలను కొన్నిటిని పాడినమీదట రఘుపతి రాఘవ రాజారామ్ సంకీర్తనతో సభముగిసెను.

అనేక గ్రామములలో

ఈడిపుచ పేర్కొన్న గ్రామములలో కూడ బాపుజీ అస్థికామజ్జన, జాతీయపరిదేవనదినము ఆత్యంత భక్తిశ్రద్ధలతో జరిగెను. కనిక, సంగం జాగర్లమూడి, చిట్టిగూడెం, పరిగిండపేట, బంకలపల్లి, గూధవరపేట, మల్లాం, ఖండవల్లి, జంగారెడ్డిగూడెం, చినుకొండ, పోనేపూడి, బాదుకు, అలపురం, జడ్చర్ల, శ్రీరంగాపురం, పజ్జపుకొత్తూరు, దర్గబాడు, కాకట్ల, కౌపూరు, సోళ్ళయూడిపాడు, ఈదరపల్లి, పత్తెపల్లి, తెనాలితాలూకా గుడివాడ, కందుకూరు, డి. పోలవరం, పులులచెరువు, మునగాల, కుమ్మకూడెం, పమర్లదుస్సాపాలూరు.

పుష్పూరు, [illegible] కాకుమానాయుడు పలిస్పేటపురం, ఉయ్యాలవాడ, అగనంపూడి, అరణి, కుమ్మరిపేట పాళ్ళెరి, మీ[illegible] పెద్దవెన్నల్లి నోనవ్వల్లి తాలూకా బాగలూరు సమస్థానం కొత్తపల్లి, గోవరం, కాల్వేటినగరము.

మునగాల, జోగన్నపాలెం, కనిగిరి, నందిగామ, జాని, పెలిపెల అగ్రహారము, టి. తిమ్మాపురం, కృష్ణాపెదపూడి, ఇరుపూరు, కొత్తవారిపల్లె, గార్లపేట, ఉండూరి, బ్రాహ్మణతర్లా, భర్గేశ్వరం, అమరావతి, కొండగిరి, ముడిచర్ల, జమ్మకుంట, గిడుతూరు, రాయచోటి, మండపేట, మెరకచామవరము, జీలంపల్లి, రాళ్లకుంట, పోనాకల్లి, చెక్కలి, ఆముదాలవలస, నీరాపురం, పాకిపల్లి, [illegible], మిళియాపుట్టి, సింబగలు, పొన్నూరు, పుయ్యాలు, ఈదరాడ, [illegible], ముట్టపర్రు, పేరాల, పెదపల్లపూడి, పాతకోరంగి, కొగ్గకుంట, కడపజిల్లా కల్లూరు, మడికి, ఉదయగిరి, చిన్నవోగిరాల, సంరయూరు, రాయదరము, కరంగి, బుక్కపట్నం, యిల్లంపేట, పిడుగురాళ్ళ, పెదపూడి, తుళ్ళూరు, పాదిలె, ఏలూరు అవనిగడ్డ, జగ్గుపురం, పెద్దప్రోలు, రంగరాయపేట, ద్వారపూడి, పెంకటగిరి, దాసరిపల్లి, చింతపరిమి, గ్రామోపం, భీమలాపురం, పేరకలపూడి, పేకి, కొలకలూరు, రాయారు.

మహాత్ముని పాశ్చాత్య అనుచరుల నిర్ణయం

ఫిబ్రవరి 29 న పారిస్‌లో ఉపవాసాలు: ధర్మకార్యాలు

పారిస్, ఫిబ్రవరి 15: ప్యారిస్ నగరంలో గాంధిసంఘానికి చెందిన పాశ్చాత్యులు 100 మంది వారి మిత్రులు సానుభూతిపరులు, ఫిబ్రవరి 29వ తేదీ ఆదివారం గాంధినిదనంగా పరిగణించి, ఆరోజు ఉపవాసం, ధర్మకార్యాలు, మొదలగునవి చేస్తారు అని రాయిటర్ విలేఖరి వ్రాస్తున్నాడు.

ఆరోజు ఉపవాసం చేయడం వల్ల మిగిలిన ఆహారాన్ని, రేషన్ టికెట్లను, ద్రవ్యాన్ని దరిద్రానికి వినియోగిస్తారు. పారిస్‌లో వీరవారి మహాయోగి నిమిత్తం ఆ రోజున మత్తు పానీయాలను- పొగాకును కూడ విసర్జిస్తారు. ఆ రోజు సంతాపకరమైన రోజుగా ఉండక ఆధునికయుగంలో భారతదేశంలో జన్మించిన ఋషిపుంగవుని, శాంతిప్రబోధకమైన వేదాంతాన్ని స్మరించుకొంటూ సంతోషంగా గడపాలని, ఒక మహాత్ముడ్యాగాన్ని చూచి, సంతోషించవలసిందే గాని దుఃఖించడంగాని విచారపడడంగాని కలగదని, గాంధి సంఘాధిపతి లాన్జాడిస్ నస్లో తన అనుచరులకు ఆదేశ మిచ్చాడని తెలుస్తున్నది.

నిర్మాణకార్యక్రమాన్ని అమలుజరపాలి

నామధారి సిక్కుల తీర్మానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: నామధారి సాధనసంఘ యాజమాన్యాన నామధారి వర్గానికిచెందిన సిక్కులు సమావేశమై, గాంధీజీహత్యను గర్హిస్తూ తీర్మానంచేశారు. గాంధీజీ నిర్మాణకార్యక్రమాన్ని అనుసరించాలని సూచిస్తూ మరొక తీర్మానం కూడా చేశారు. ఈ సమావేశానికి మూలంకర్ అధ్యక్షత వహించాడు.

దేశంలో మతంపేరిట మతవిద్రోహులే మతకల్లోలాలు సాగిస్తున్నారని, మతవిద్వేషాలకు మూలకారణం బ్రిటిష్‌వారేనని, వారు వెళ్లిపోయిన తరువాతగూడా స్వార్థబుద్ధిగలవారు గూడిన దురహంకారం ప్రజ్వరిల్లడం చాలా శోచనీయమని మవలంకర్ అన్నాడు.

సమావేశానికి పండిట్ నెహ్రూ పంపిన సందేశాన్ని చదివారు.

మహాత్మునికి కాశ్మీర్ రాజదంపతుల జోహార్లు

జమ్మూ, ఫిబ్రవరి 12: గాంధీజీ అస్థి నిమజ్జనోత్సవ సందర్భంలో కాశ్మీర్ రాజదంపతులు మహాత్ముడికి జోహార్లర్పిస్తూ ఒక ప్రకటనచేశారు. "నవభారత నిర్మాత గాంధీజీ తన మాతృదేశాన్ని పీడిత ప్రజానీకాన్ని సేవిస్తూ ఆసేవలో తుదకు తన ప్రాణాలనుగూడా అర్పించాడు. మానవజాతి ఉద్ధారకుడైన మహాత్ముని హత్యగావించడం చాలాశోచనీయం. ఇలాంటి మహాపురుషులు జన్మించినందులకు భారతభూమి గర్వపడాలి. ఆయన దివ్యాదర్శాలను ఆచరణలో పెడతామని మనమంతా ప్రమాణం స్వీకరించాలి అని మహారాజు అన్నాడు. గాంధీజీ స్త్రీల యెడ చాలా గౌరవాభిమానాలుగల వ్యక్తియని మతకల్లోలాలలో ఆపద్గ్రస్తులయిన స్త్రీల విషయమై ఆయన చాలా ఆందోళన జరిపాడని, ఆయన కృషిని పంపూర్తి చేయడానికి స్త్రీలంతా పూనుకోవాలని మహారాణి అన్నది.

రాంపూర్ నవాబ్

జాతి మత వర్ణ వివక్షతలకు అతీతుడైన మహాత్ముని గనుకనే, గాంధీజీ విషాద మరణానికి మనస్సు ప్రపంచమూ దుఃఖిస్తున్నది. మానవజాతిని ప్రేమించి మానవజాతికి సేవ చేసిన మహాత్ముడు. ఆయన ఆదర్శాలను అనుసరించి జీవితంలో వాటిని అనువర్తించుకోవడమే ఆయనకు మనం నిర్మించగల ఉత్తమ స్మారకచిహ్నం" అని రాంపూర్ నవాబ్ గాంధీజీ స్మారక సభలో ఉపన్యసిస్తూ అన్నాడు.

గాంధీజీ స్మారకార్థం న్యూఢిల్లీలో కళాభవనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: గాంధీమహాత్ముని స్మారకార్థం అ. భా. లలితకళా స్థాపక సంఘం వారు న్యూఢిల్లీలో "గాంధీ కళాభవన్" అనే పేరుతో ఒక సువిశాలమైన కళాభవనమును నిర్మించడానికి తీర్మానించుకున్నారు. ఈ భవనంలో ఒకభాగమందు భారతజాతీయ చిత్రకళా ప్రదర్శనశాల ఏర్పాటు చేయబడుతుంది.

వర్తమాన చిత్రకారుల రచనలను ప్రదర్శించడానికి కూడా ఈ భవనంలోనే ఒక మందిరం ప్రత్యేకించబడుతుంది. ఇవిగాక శిల్పశాస్త్రంలో ఉన్నత విద్యాబోధన చేసే ఒక కళాశాలకూడా ఈ భవనంలోనే అంతర్భాగంగా ఉంటుంది.

"భారతీయ శిల్పంలో గాంధీమహాత్ముని రూపచిత్రణ" అనే పేరుతో అఖిలభారత లలితకళా స్థాపక్య సంఘంవారు ఢిల్లీలో ఏప్రిల్ 2 నుంచి 10 వరకూ గాంధీమహాత్ముని చిత్రపటముల ప్రదర్శనను ఏర్పాటు చేయనున్నారు.

గాంధీమహాత్ముని జీవిత పరమార్థము ఫలోన్ముఖమైనన్న తరుణంలో ఆయన ఇంత దారుణంగా బలవన్మరణానికి గురి అయినందుకు సంతాపిస్తూ ఈ సంఘం వారు ఇటీవల ఒక తీర్మానంచేశారు.

జబ్బల్ సంస్థానంలో స్మారకచిహ్నం

సిమ్లా, ఫిబ్రవరి 16: ఉత్తర హిమాలయపర్వత భూములలో ఉన్న జబ్బల్ సంస్థానమందు గాంధీమహాత్ముని స్మారకార్థం తగినచిహ్నం ఒకటి నిర్మించడానికి సంస్థాన ప్రజలు తీర్మానించారు.

సి. పి. శాసనసభలో గాంధీజీ చిత్రపటం

నాగపూర్, ఫిబ్రవరి 16: సి. పి. గవర్నరు మంగళ్‌దాస్ పక్వాసా గారు బహూకరించిన గాంధీమహాత్ముని చిత్రపటం ఒకటి శాసనసభా భవనంలో ప్రేలాడ గట్టబడుతుంది.

మార్చి 2 వ తేదీన శాసనసభ సమావేశమైనప్పుడు చిత్రపటావిష్కరణ జరుగుతుంది.

తిరునెల్వేలీలో విగ్రహ ప్రతిష్ఠ

తిరునెల్వేలి, ఫిబ్రవరి 15: తిరునెల్వేలి మునిసిపల్ కౌన్సిలువారు పురమందిర ప్రాంగణమందున్న అరామంలో గాంధీజీ విగ్రహప్రతిష్ఠ చేయడానికి నిర్ణయించారు.

పాంఫెలో స్మారకసభ

పాంఫై, ఫిబ్రవరి 16: గాంధీమహాత్ముని సంస్మరణార్థం నేడిక్కడ జరిగిన ఒక సమావేశంలో భారతీయ మహిళలు గాంధీ మహాత్మునికి ప్రియమైన కొన్ని గీతములు గానంచేశారు. వైస్రాయ్ వృద్ధ రాజకీయవేత్త అయిన డాక్టర్ డబ్ల్యు యెన్ సమావేశంలో ఉపన్యసించాడు. వైస్రాయ్ ఇండియాలమధ్య సాంస్కృతిక సంబంధాలను పెంపొందించడానికి ఒక ఏడాదిక్రిందట స్థాపింపబడిన వైస్రాయ్ ఇండియా ఫ్రాండ్‌షిప్‌వారి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.

గాంధివిగ్రహం-ఎం ఎస్. ఎం.

ఎం. ఎస్. ఎం రైల్వే అధికారులు రూ 30,000 వసూలుచేసి గాంధిమహాత్ముని కంచువిగ్రహం సెంట్రలస్టేషనువద్ద స్థాపింపదలచిరి.

ప్రకటన

పాలకొల్లు మునిసిపాలిటీ

ఇందుమూలమున తెలియపరచునదేమనగా: 1948-49 సంవత్సరమునకు (1) శేవారం సంత (2) డైలీ మార్కెట్టు (3) పశువుల సంత (4) కార్టు స్టాండులు (బళ్ళవుబండ్లుపట్టే) (5) మోటారు స్టాండులు (6) గొర్రెల కబేళా (7) పశువుల కబేళా వీటియందు ఫీజు వసూలుచేసుకొనే హక్కున్ను (8) పశువుల సంతలోని చెత్త పేడ (9) టవునులోని పేడ (10) గొర్రెల కబేళాలోని పేడ (11) పశువుల వధశాలలోని పేడ, మైల (12) టవునులోని పందిపెంట తీసుకొనిపోవు హక్కున్ను 2-3-1948 తేదీ మంగళవారము సాయంకాలము 2 గంటలకు మునిసిపల్ ఆఫీసు భవనమునందు కమీషనరు గారితో గాని, వారి అనుమతి పొందిన వారితో గాని బహిరంగముగా వేలం వేయబడును.

పాటదారులు వర్గైరా యావత్తు తదితరములు మునిసిపల్ ఆఫీసులో ఆఫీసు తెరువబడెడు కాలమందు తెలియనగలవు.

(సం) కె. పి. ఏకాంబరం,
కమీషనరు,

టెండరు

ఎం అండ్ ఎస్. ఎం. రైల్వే

ఆర్కోణంవద్ద శిబ్బందికి క్వార్టర్లు కట్టుటకు (కిరు యూనిట్లు) 10-3-1948 తేదీ బుధవారము పగలు 12 గంటల వరకు మద్రాసు ఎం. అండ్ ఎస్. ఎం. రైల్వే ఫీస్ యిందమీదుగానే సీలు చేయబడిన టెండర్లు తీసికొనబడును.

సెట్టు 1 కి రు 10/-లు చెల్లించి దరఖాస్తుచేసినచో టెండరుఫారములు ఇతర వాక్యము మెంట్లు సప్లయిచేయబడును.

టెండరు 1 కి రు 500/-ల వంతున ముందుగా ధరావతుపైకము చెల్లించవలెను.

పని విలువ సుమారు ఆరవై వేల రూపాయలు.

ఘనసారచందిని

ఎరుపు, తెలుపు, పసిమి, మరుపగం అంటు నీలకుసుమవ్యాధులను నిరోధించును. సీసా రు 2-4-0 అమ పాసమునకు దండిని అక్షరము సీసా రు 1/- పోస్టేజి ప్రత్యేకం. పి. శ్రీ. పి. అండ్ కంపెనీ, ఆయుర్వేదసదనం, పెరిదేవి, నెల్లూరుజిల్లా.

ప్రాత్యకాలపు కథము అపాయపు చిహ్నము



ప్రొద్దుటనే విశేషముగా దగ్గుకలుగుచు కథము పడునా? అది అపాయపు చిహ్నము. ధూళి, పొగ, పిటిలోనుండు క్రిములు గొంతులో, ఊపిరితిత్తులలోకి పాకిన కారణం కలుగును. వెంటనే శ్వాసకోశములకు చెడ్డది.

ప్రొద్దున కథము పడినట్లైతే ఒక డబ్బా సాంటే పేస్టిల్స్ కొనుడు. సాంటే పేస్టిల్స్ దగ్గును ఆపి రాకుండ నిలిపివేయును.

మొట్టమొదట ఒక సాంటే పేస్టిల్ నోటిలో వేసి చప్పరించుడు. తక్షణమే మీ గొంతు, నోటికి చెమ్మదిగలుగును. [illegible] దగ్గు జాలదు.

సాంటే పేస్టిల్స్ ఈ పదార్థములంతో ఇంపుగా నుండును. వెల ఒక రూపాయి. [illegible] కిమ్మట్టులవద్ద, అన్ని స్టోర్లలో దొరకును.

సాంటే పేస్టిల్స్ మీకు చేయుమేలు [illegible] మీరే గ్రహించగలరు.

తయారుచేయువారు:
కాంట్రీ అండ్ కం॥ లి॥ యార్క్ - ఇంగ్లాండు.

RN 795 Tel.

MEN ONLY MEN ONLY MEN ONLY MEN ONLY MEN ONLY MEN ONLY

men only
CIGARETTES
GIFT SCHEME

అమెరికన్, ఇంగ్లీషు, ఫౌంటెన్ కలములలోని ప్రధాన రకము లనేకమునుండి మీ యిష్టము వచ్చిన దానిని కోరుకొనండి. మెన్ ఓన్లీ సిగరెట్ల పెట్టెలలోను, డబ్బాలలోను మీకు వచ్చిన కూపన్లను యిచ్చినచో మీరు కోరిన కలము మీకు లభించగలదు. ఆశ్చర్యకరమగు యీ బహుమతి విధానమును గురించిన పూర్తి వివరములకొరకు మీ దుకాణదారుని అడగండి.



10 సిగరెట్లు కల ప్రతి పెట్టెలో ఒక యూనిటు విలువగల ఒక కూపను, 50 సిగరెట్లు కలప్రతి డబ్బాలో 5 యూనిట్లు విలువగల ఒక కూపను ఉంటుంది. ఇంతేగాక 100 యూనిట్లవరకు విలువగల కూపన్లు కూడా అప్పుడప్పుడు వీటిలో నుంచబడును. అదృష్టవంతులైతే మీకే అవి రావచ్చును.

An Announcement of
ANATOLIA LIMITED, 23, Convent Road, Calcutta 13
Agents for
McAlister & Gray Ltd., of The Strand, London

MEN ONLY MEN ONLY MEN ONLY MEN ONLY MEN ONLY MEN ONLY

నూతన సంవత్సరాది కానుక

యేప్రెలు 10 తేది ఆంధ్రదేశమున

అన్ని ముఖ్యకేంద్రములలో విడుదల

మురళీ పిక్చర్సువారి

మహత్తర పౌరాణిక తెలుగుచిత్రము

-: భక్త త్రియాళ :-

తారాగణము

గద్దయ్య, సి. యస్. ఆర్. ఋష్యేంద్రమణి రాజారావు, సుందరమ్మ, కేనరి, కుంపట్ల, మాస్టర్ పద్మనాభం, మాస్టర్ హరనాథ్, మాస్టర్ వెంకటేశ్వర్లు.

డైరెక్షన్:— జి. ఆర్. రావు.

వివరములకు

ఆంధ్ర జిల్లాలు:—

ఫేమస్ ఫిలిం సర్క్యూట్, నెల్లూరు.

దత్తమండలములు:—

సాయినాథ్ టాకీ డిస్ట్రిబ్యూటర్సు, గుంతకల్లు.

ఇతర వివరములకు

మురళీ పిక్చర్సు

నెం. 4 పైక్రాఫ్టు ఫస్టు స్ట్రీటు, మద్రాసు 14.

ప్లాంటర్సు



హై గ్రౌన్

—నీలగిరి—

తేయాకు

సంతోషకరమైన ఎక్కువ సువాసన యిచ్చును

The Planters Company, Ltd., Coonoor, Nilgiris, S. India.

ధీనినేకోరుదు...



వ్యవసాయదారుల సహాయచట్ట సవరణ

మాధవమీనన్‌గారి బిల్లుకు శాసనసభ ఆమోదం

నుంగళవారం మధ్యాహ్నం రాష్ట్ర అసెంబ్లీ సమావేశమైనప్పుడు సభలో కోరం లేకపోయింది అపుడు గంటమ్రోగగా సభ్యులు వచ్చిరి. అనంతరం శ్రీ పి. వెంకటేశ్వరులుగారు తన ప్రసంగం సాగిస్తూ వ్యవసాయ కూలీలు పడుచున్న బాధలను వివరించిరి వారు నామురూపడంలో తమ ఫలసాయంలో సగభాగం భూస్వాములకు యిచ్చివేయవలసి ఉంటున్నదనియు చిట్టి ఋణబాధలన్నిటిని పూర్తిగా నివారించుటకు తలపెట్టవలెననిరి. స్వల్పవైతులు యిపుడు చాలా చోట్లలో తమ ఫలసాయమందు దాదాపు మూడుపాళ్లు భిన్నంగా యిచ్చివేయవలసియున్నది. వీరికి సహాయ్యపడవలెనంటే వారి ఋణగ్రస్థతను ప్రభుత్వం సమూలంగా నివారించక తప్పదని చెప్పి బిల్లును సెలెక్టుకమిటీ ఆలోచనకు నివేదించుటకు బలపరుస్తున్నాననిరి.

వ్యవసాయమంత్రి జవాబు

వ్యవసాయమంత్రి శ్రీ కే. మాధవమీనన్‌గారు సభ్యుల విమర్శలకు యీ క్రిందివిధముగ సమాధాన మొసగిరి.

మహ్మద్ అన్వారీ సాహెబుగారు ఈ బిల్లును ప్రజాభిప్రాయానికి నివేదించవలెనని ప్రతిపాదించిరి. అట్టిది అనవసరమని నా అభిప్రాయం. ఏలనగా యీబిల్లు ప్రకటించి సుమారు 8 మాసాలు అయినది. అప్పటినుంచి యిది అజెండాలో నుంటూ ఉన్నది. ఇంత అవకాశం ఉండియూ ప్రజాభిప్రాయం తెలుసుకోటానికి ఇంకా అవకాశం యివ్వాలని కోరడంలో నాకు అర్థం గోచరించలేదు. చాలామందిసభ్యులు యీబిల్లు గతించిన కాలానికి వర్తింపజేయకూడదని ఆక్షేపణ తెలిపియున్నారు. నేనున్నూ, సభానాయకుడున్నూ అట్టి అభిప్రాయమే కలవారము. కాని యీ బిల్లు పరతులు సరిగా ఆలోచించి చూస్తే నిజంగా గతించిన వ్యవహారాలకు వర్తించదనే చెప్పవలెను. ఏవైనా దావాలు పరిష్కారం కాకున్నట్టయితే అట్టి దావాలకు యీ కొత్త బిల్లు పరతులు వర్తింపచేయడం న్యాయమే అనవచ్చు కావున యీబిల్లులో అట్టి లోపధోరణి మరతులు లేవని నా ఉద్దేశ్యం.

అదియునుగాక కోర్టుల తీర్పులవల్ల బాధకము ఏర్పడిన కేసులలో అట్టి బాధకములను తొలగించుటకు సయితము యీబిల్లు తలపెట్టుచున్నది. పేరేవ్యక్తుల పేర్లలో బినామీగా పాతఋణాలనే పునరుద్ధరించుకొన్నట్టి కేసులలోకూడా పరిహారంయిచ్చుటకు యీ బిల్లు ఉద్దేశిస్తున్నది ఫలసాయం అనుభవంగల తన భూములపెట్టుకొన్నవారు చాలావరకు తాము అప్పిచ్చిన మొత్తమును కొన్నియేండ్లలోనే బడ్డీలు గట్టిగియుండురు. కావున అట్టి తన భూములకు యీ బిల్లును వర్తింపచేయడంలో ఎట్టి అన్యాయం లేదనిరి. సెలెక్టు కమిటీలో అట్టి తన భూల విషయమైకూడా సవిమర్శగా ఆలోచించి నిర్ణయానికిరావచ్చును. ఈ బిల్లును శాసనం చేయుటవల్ల వ్యవసాయదార్ల ఋణములు ఎంత మొత్తం రద్దు చేయవచ్చుననే విషయం తెలుపవలసినదని శ్రీ వరదాచారి గారు కోరినారు. అట్టి లెక్కలను యిపుడు తెలియపరచుట సాధ్యంకానిదని. వ్యవసాయ కూలీలకు కూడా యీ బిల్లును వర్తింప చేయవలెనని శ్రీ రాఘవయ్య, శ్రీ వెంకటేశ్వరులు గార్లు సూచించియున్నారు. వ్యవసాయ కూలీలు యిసర కార్మికులవలెనే నిత్యబత్తెములను పుచ్చుకొని అంతటితో ఊరుకుంటారు. వ్యవసాయ కూలీల ఆర్థికస్థితి బాగుపరచి వారల ఋణబాధలను కూడా తీర్చుట అవశ్యకమే అయినప్పటికీ యీ బిల్లునందు వారిని చేర్చటానికి సాధ్యపడదు. దేశంలో ఆహారోత్పత్తిని ప్రోత్సహించే నిమిత్తమే వ్యవసాయదార్లను మాత్రమే ప్రస్తుత బిల్లునందు చేర్చడమైనదనిరి.

ఆపైని స్పీకరు బిల్లును జాయింటు సెలెక్టు కమిటీకి నివేదించే ప్రతిపాదనను ఓటుకు పెట్టగా సభవారు ఆమోదించిరి.

అపహృత స్త్రీ విమోచన

పండిత్ నెహ్రూ రేడియో ప్రసంగం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: అపహృత స్త్రీ శిశువులను విడిపించటంలో తోడ్పడవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ప్రధాన మంత్రి నెహ్రూ నేడొక రేడియోప్రసంగంలో ఇలా అన్నాడు:—"గడచిన 6 మాసాలుగా దేశంలో అనేక శోచనీయమైన సంఘటనలు జరిగినవి; వీటినిగురించి తలపోసి నప్పుడల్లా నేను సిగ్గుతో మగ్గిపోతున్నాను. స్త్రీల అపహరణ ఇటీవల జరిగిన దుర్నయాలలో కల్లా ఘోరాతిఘోరమైనది. మన దేశముయొక్క పేరు ప్రతిష్ఠలు నలుగురి దృష్టిలోనూ ఈ సంఘటనవల్ల పూర్తిగా పడిపోయినవి. భారతీయ ప్రజలు ఈ మచ్చను తొలగించి వేయాలి. పాకిస్తాన్‌లో ఏమిజరుగుతున్నది అన్నది మనకు ప్రస్తుతంకాదు; పాకిస్తాన్ ప్రభుత్వం అపహృత స్త్రీలను విడిపించడంలో సాయపడకపోయినా మనం మన విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించాలి. లేవనెత్తుకొని పోబడినవారిని బంధువులు ఆప్యాయంతో చేరదీసుకోవాలి. ఇదివరకు వారిని యెంత ఆదరంతోనూ ప్రేమతోనూ చూచేవారమో వారిని ఇకనుండటకూడా అంత ప్రేమతోనూ మర్యాదతోనూ చూడాలి. జరిగిన దానికి వారేవిధంగానూ బాధ్యులు కాంనే విషయం మనం విస్మరించరాదు. మనం అపహృత స్త్రీల సమస్యను యెంత శీఘ్రంగా పరిష్కరించ గలిగితే, గాంధీమహాత్ముని ఆత్మకు అంత సంతృప్తి కలిగించిన వారం అవుతాము. మీరు రేడియోలో ఈ విషయమై గాంధీజీ అభిప్రాయాలను ఆయన కంఠస్వరం ద్వారా ఇంకనుండే విన్నారు. ఆయన కోరికలను మీరు తప్పకుండా తీర్చగలరనే విశ్వాసం నాకున్నది. ప్రజాభిప్రాయాన్ని జాగరితంచేసి, అపహృత స్త్రీ శిశువులను చెరవిడిపించడంలో సహకరించ వలసిందని ఉద్బోధించడానికి నాను, పాకిస్తాన్ ఇండియా నాయకులు పరస్పరం ఈ వారంరోజులూ రేడియోలో బ్రాడ్‌కాస్టు ప్రసంగాలు చేస్తారు. నెహ్రూచేసిన పై ప్రసంగం ఈ కార్యక్రమానికి నాందీ ప్రస్తావన లేపు ఈ విషయ మరిచేచే రాజేంద్రబాబు కూడా రేడియోప్రసంగం చేస్తాడు. ఉభయ అధినివేశాల పునరుద్ధరణకొఱకు మంత్రుల ప్రసంగాలు కూడా రేపే జరుగుతవి.

భారతీయ సాయుధసేనలలోని ఉన్నతోద్యోగుల భార్యలు స్త్రీ క్షేమవిచారణ సంఘం అనే పేరుతో ఒక కమిటీ ఏర్పాటుచేయడానికి నిశ్చయించారు. కాశ్మీర్ నుంచి వచ్చే శరణార్థులలో క్షతగాత్రులు వ్యాధిగ్రస్తులు అయిన మహిళల యోగక్షేమాలను విచారించి సేవచేయడం ఈ కమిటీ లక్ష్యం.

లియాఖత్ అలీఖాన్ విజ్ఞప్తి

లాహోర్, ఫిబ్రవరి 16: నిర్బంధింపబడివున్న అపహృతస్త్రీలను అందరినీ విడిచిపుచ్చవలసిందిగా పాకిస్తాన్ ప్రధాన మంత్రి లియాకత్ అలీఖాన్ నేడొక బ్రాడ్‌కాస్టు ప్రసంగంలో పాకిస్తానీయులకు విజ్ఞప్తి చేశాడు:

ఉభయప్రభుత్వాలు ఈ అభాగ్యస్త్రీల విషయమై ప్రజాభిప్రాయాన్ని జాగరితం చేయడానికి రేడియో కార్యక్రమాలు ఏర్పాటుచేసినవి. ఇండియా పాకిస్తాన్‌ల ప్రజల ప్రభుత్వంలో హృదయపూర్వకంగా సహకరించినటయితే, ఈ వారంరోజుల్లోనే అపహృతులైనవారి నందర్నీ ఎవరికుటుంబాలకు వారిని అప్పగించివేయడం సాధ్యపడవచ్చును.

ఇటీవల హిందూ ముస్లిం సంబంధాలు మరీ దారుణంగా పర్యవసించినవి. గాంధి మహాత్ముడు హృదయైక్యత సాధించడానికి తన ప్రాణంకూడా బలి ఇవ్వవలసివచ్చింది. లేవనెత్తుకొని పోయిన స్త్రీలను శిశువులను విడిచిపెట్టి భారతీయులు గాంధీజీ ఆత్మకు శాంతికలిగించాలని కోరుతున్నాను. పాకిస్తాన్ ప్రజలకుకూడా నేను చేసే విజ్ఞప్తి అదే.

స్త్రీలను గౌరవించాలని ఇస్లాంమతం బోధిస్తున్నది. మతవర్ణ వివక్షత లేకుండా అబలలను రక్షించాలన్నది మన మతంలోని ప్రధాన నియమం.

అపహృత స్త్రీ శిశువులను విడిపించడం రాజకీయదృష్ట్యా మనకే లాభకరం అన్న మాట అటుంచి, మతనైతిక దృష్ట్యాకూడా అది మన విధ్యుక్తధర్మం అని గమనించాలి."

ఉప్పుఉత్పత్తి సరఫరాలు

అధినివేశ శాసనసభలో ప్రశ్నోత్తరాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: అధినివేశ శాసన సభలో నేడు ప్రశ్నల సందర్భంలో అనంత సయనం అయ్యంగార్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి యన్. వి. గాడ్గిల్ ఇల్లా చెప్పారు.

"కాకపోతలకై క్రొత్త విమానాలను కొనవలసిన విధి విమాన కంపెనీల వారిది కాని ప్రభుత్వానిది కాదు. ప్రభుత్వం నియమించిన డైరెక్టర్ జనరల్ పని అంతా దానికి కావలసిన ఎక్స్‌ఛేంజి సౌకర్యాలను సమకూర్చడం, కొన్ని కొన్ని సలహాలివ్వడం మాత్రమే. కాశ్మీరు యుద్ధ పరిస్థితులవలన సివిల్ విమానములనేకములు యుద్ధానికై తీసుకోబడినవి. కనుక క్రొత్త విమానములను కొనమని విమాన కంపెనీలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది."

కే శివరావు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, ప్రస్తుతం హిందూస్థాన్ విమాన కంపెనీవారు అనేక విమానములను క్రొత్తగా నిర్మింపబోతున్నారని, ఇంజనులు మాత్రమే ఇంగ్లండునుండి దిగుమతి చేస్తున్నారనీ శ్యాంప్రసాద ముఖర్జీగారన్నారు. ఈ విమాన నిర్మాణం పూర్తి కావటానికి 18 నెలలు పట్టుతుందనికూడా ముఖర్జీగారన్నారు.

రేడియోసిట్టరు లైసెన్సు సలహాదారి అమ్మకలేనని ఉన్న నిబంధనను ప్రభుత్వం కొట్టివేసి సవరించ బోతున్నదని కేశవరావు ప్రశ్నకు సమాధానంగా గాడ్గిల్ గారు అన్నారు.

ఆవకాయ మొదలైన ఊరగాయలను తయారుచేసే కాలం సమీపిస్తోంది కనుక ప్రభుత్వం ఉప్పు నెక్కువగా సరఫరా చేసే ప్రయత్నాలేమైనా చేస్తోందా అని డాక్టర్ పట్టాభిగారు రడిగిన ప్రశ్నకు అంతరాయ సమాధానం యిచ్చుచూ, డాక్టర్ ముఖర్జీ సమాధానం యిచ్చుచూ, ఉప్పు కొరత వున్న ప్రదేశాలకు సరఫరా ఎక్కువచేయటానికి ప్రభుత్వం కృషిచేస్తున్నదనీ, అభివృద్ధి సూచనలు కనిపిస్తున్నాయిగాని ఆవకాయ విషయం తనకు తెలియదని అనగా సభికులు గురింతగా నవ్వారు.

హెచ్. వి. కామత్: ఆవకాయకు ఉప్పు చాల ముఖ్యపదార్థమని ప్రభుత్వమునకు తెలుసా?

స్పీకరు జవాబు: ఇది ఆవకాయకు సంబంధించిన ప్రశ్నకాదు. (నవ్వు)

దామోదర్‌లోయ కార్పొరేషన్ బిల్లుపై చర్చ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: దామోదర్‌లోయ కార్పొరేషన్ బిల్లుపై అధినివేశ శాసనసభలో యివ్వాళగూడా చర్చ జరిగింది. కేంద్రప్రభుత్వం విధించే పన్నులు కార్పొరేషనుకువర్తింపకుండా చేయాలని, యిలా చేయకపోయినట్లయితే పశ్చిమ బెంగాల్, బీహారు ప్రభుత్వాలు న్యాయంగా తమకురావలసిన లాభాలను కోల్పోవలసి వస్తుందని జైపాల్ సింగ్ సూచించాడు.

బిల్లుకు అనుకూలంగా విశ్వనాథదాసు మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు నిర్మాణంమూలంగా నిరాశ్రయులైపోయే ప్రజల పునరుద్ధరణకు కేంద్రప్రభుత్వం పూనుకోవాలని అన్నాడు.

చర్చకు గాడ్గిల్ సమాధాన మిచ్చాడు. "ప్రాజెక్టు నిర్మాణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కేవలం యోగ్యతలను ప్రమాణంగా పెట్టుకొనే బోర్డు సభ్యులను యమించడం జరుగుతుందని, ఈ బోర్డులో ముగ్గురు సభ్యులుంటారని, ఆయారాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపిన పిమ్మటే యీ బోర్డు నియామకం జరుగుతుందనీ గాడ్గిల్ అన్నాడు.

సహకారసంఘాలను వెలకొల్పుతూ, వాటి ద్వారా స్థానిక ప్రజల సహకారాన్ని పొందడానికి గూడా అవకాశం కల్పించబడిందని గాడ్గిల్ అన్నాడు. వ్యవసాయ పన్ను రాబడిపన్ను బెంగాల్, బీహారు రాష్ట్రాలకే వదలి వేయబడుతుందని, అయినా కేంద్ర ప్రభుత్వం గూడా కొంత పన్ను విధిస్తుందని గాడ్గిల్ వెల్లడించాడు.

రాష్ట్రీయస్వయంసేవక సంఘసభ్యుల అరెస్టులు

పూనా, ఫిబ్రవరి 16: పూనాలో గత 2 దినములందును రాష్ట్రీయ స్వయంసేవక సంఘమునకు చెందినవారు మరొక 6 మంది అరెస్టు చేయబడిరి. మొత్తము 98 మంది ఇంతవరకును రా. స్వ. సే. సంఘమునకు చెందినవారు పూనాలో అరెస్టుచేయబడిరి. మున్సిలీసు సేవకులుగాన్నుకు చెందినవారు ఇంతవరకును 19 మంది ఇచట అరెస్టు చేయబడిరి. పూనాలో కర్ఫ్యూ ఉత్తరువు లేపటినుండియు సడలింపబడును.

అహమ్మదాబాదు

అహమ్మదాబాదులోని రా. స్వ. సే. సంఘమునకు చెందిన రాష్ట్రీయ సంఘకార్యాలయమున్నూ నగరసంఘ కార్యాలయమున్నూ బొంబాయి ప్రభుత్వ ఉత్తరువుల ననుసరించి పోలీసువారు వశపరచుకొనిరి. అహమ్మదాబాదు నగరములోను యీ జిల్లాలోను ఇంతవరకు 50 మంది రా. స్వ. సేవకులు అరెస్టు చేయబడిరి.

ఇటీవల యంగ్ మెన్ నూరీగారు ఒక బహిరంగ సభలో ప్రసంగించుచుండగా ఒక మున్సిలీసు నాయకుడు ఆ సభలో అల్లరి చేసెను. అందువల్ల అతడు అరెస్టు చేయబడెను.

ఢిల్లీ

ఢిల్లీ పరగణాలో ఇంతవరకు రా. స్వ. సే. సంఘమువారు 270 మంది అరెస్టు చేయబడిరి. రాష్ట్రీయ అర్గనైజరు బసంతరావుగారు కూడా అరెస్టు చేయబడిరి.

జలంధరు

రా. స్వ. సే. సంఘ నాయకుడును ఇచటి రాష్ట్రీయ అర్గనైజరున్నూ అగు మాధవరావు నేడు ఇచట అరెస్టు చేయబడెను.

సిమ్లా

రాష్ట్రీయ స్వయంసేవక సంఘముతో సంబంధము కలిగియున్నాడనే కారణము చేత సిమ్లాలో గవర్నమెంటు ప్రెస్‌లోని పనివాడొకడు అరెస్టు చేయబడెను. ఇచట ఇంతవరకు 23 మంది రా. స్వ. సేవ సంఘసభ్యులు అరెస్టు చేయబడిరి.

ఫిరోజ్‌పూరు జిల్లాలోని ముక్త్సేశ్వరు మ్యునిసిపాలిటీ మాజీ చైర్మన్ అగు లాలా నాథురామ్‌గారు ఒక మిల్లుఆసామి-గా స్వ. సే. సంఘముతో పోలీసు సంబంధం కలదని ఎంచి అరెస్టుచేసిరి. ఆయన 1947 సం॥ మార్చి నెలలోనే ఆ సంఘముతో సంబంధం వదులుకున్నారు. కాని యిచట ఆయనకు ప్రతికూలురైనవారు కొందరు కుట్రచేసి ఆయనను అరెస్టు చేయించిరి. కనుక ఆయనను నేడు విచారణ లేకుండా నిర్బంధములో నుంచుట అక్రమమనియు, విడుదల చేయవలెననియు కోరుచు పిటీషను దాఖలు చేయబడెను.

కాన్పూరు

కాన్పూరులో టెలిగ్రాఫ్ ఇంజనీరింగు సూపర్‌వైజరు అగు ఆర్. డి. గుప్తగారు రా. స్వ. సే. సంఘముతో సంబంధముకల వారనే అనుమానముచేత అరెస్టు చేయబడిరి. కాని దరియాప్తుచేయగా ఆ సంఘముతో ఆయనకు సంబంధము లేదని తెలిసినది. ఆయనను నేడు డిస్ట్రిక్టు జైలునుండి విడుదల చేసిరి. కాన్పూరుజిల్లా జైలులో ప్రజారక్షణచట్టముక్రింద అరెస్టులో ఉంచబడిన మరొక 20 మందికూడా విడుదల చేయబడిరి. ఒక్కొక్కరు రూ. 200 కు పూచీపత్రము వ్రాసియివ్వవలెనని అధికారులు కోరిరి. వారు ప్రభుత్వ ధిక్కరణోద్యమములందు పాల్గొనమని వ్రాసి యివ్వవలెను.

అమ్మకము

అన్నిరకముల ప్రింటింగు మెషినరి క్రొత్తవి, రీబిల్టు, గ్యారంటీ అయినవి. ఇదివరకే అనేకమైన చాండ్లర్ ప్రెడిజ్ అమ్మబడినవి. తనిఖీ చేసికొనవచ్చును. ఇంకను ఎక్కువగా వచ్చుచున్నవి. వెంటనే వ్రాయండు.

ASHBY & COMPANY,
41, Alli Chambers, Medows St.,
Bombay.

శ్రీ సుబ్బానేశ్వరస్వామి 4 వార్షిక పశువుల జాత్ర 74 వ డెగోశం

1948 మార్చి 9 నుండి 16 వరకూ బళ్లారి జిల్లా రాయదుర్గంసమీపమునందుండు 74 వ డెగోశంలో వైభవముగా జరుపబడును.

పశువులకు మేత నీళ్లు వచ్చిన వారికి తగు మైనవసతులు యేర్పాటు చేయడమైనది. ఆకర్షణీయమైన పశువులకు ఇతరజీవరాసులకు బహుమతులివ్వబడును.

టి తిప్పిస్వామప్ప
ప్రొప్రయిటరు, కెలిమేషామిల్సు, చిత్రదుర్గం
క్యాంపు: రాయదుర్గం 30-1-48.



టాస్కో

పెక్టారల్ సిరప్

దగ్గు, జలుబు, రొమ్ముపడిశములకు

ది ట్రావెంకూర్ సుగర్స్ & కెమికల్స్ లిమిటెడ్. తిరువనంతపురం.

శక్తిటరీస్ & ట్రేడర్సు: ప్యారీ & కంపెనీ, లిమిటెడ్.

20-2-1948 - విడుదల

బాలసరస్వతి - రఘురామయ్య - పద్మనాభరావు - రామకృష్ణశాస్త్రి - కోటిరత్నాలి-సుందరమ్మ-రామమూర్తి-చెంచురత్నం మున్నగువారు నటించిన

శ్రీ చత్రపతివారి

రాధిక

డైరక్షన్-విపిటి-సదాశివ్

కెమెరా—P. L. రాయి.

సౌండ్—K. రామచంద్రన్.

స్టుడియో—నెప్ట్యూన్.

వివరాలకు:

శ్రీ చత్రపతి పిక్చర్సు (మద్రాసు) లిమిటెడ్

4. ఆళ్వారుపేట వీధి—మద్రాసు, 18.

చమేరియా రిలీజు.

బెజవాడ	— శ్రీ మారుతిసినిమా
రాజమండ్రి	— జయాటాకీస్
కాకినాడ	— న్యూ క్రౌనుటాకీస్
గుంటూరు	— రాధాకృష్ణటాకీస్
ఏలూరు	— కేసరిపిక్చరుపాలెస్
మచిలీపట్నం	— సరస్వతీటాకీస్
తెనాలి	— రత్నాటాకీస్
బళ్లారి	— స్టార్ సినిమా
కర్నూలు	— కృష్ణ టాకీస్

Edited, Printed & Published by S. Sambu Prasad at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., G. T., Madras